



అమరావతి: కృష్ణానదిలో హంసవాహనంపై స్వామివార్ల తెప్పోత్సవం



కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామికి జలాభిషేకం
పాలతో..
కుంకుమతో..
పసుపుతో..
విభూదితో..
చెక్కరతో..
ఫలాలతో
విశేష అలంకారం



దీపోత్సాహం



అమరావతి: ప్రత్యేక అలంకరణలో అమరేశ్వరుని మూలవిరాట్



అమరావతిలో నక్షత్రహారతి ఇస్తున్న అర్చకులు

- కోలాహలంగా కార్తీకపౌర్ణమి
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- వైభవంగా కోటి దీపోత్సవం, జాల్వాతోరణం
- సూర్యలంక తీరంలో జలవందనం జనసంభరం
- కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు
- అమరావతిలో పుణ్య హారతులతో పులకించిన కృష్ణమ్మ



కోటప్పకొండలో నంది విగ్రహం వద్ద దీపారాధనలు చేస్తున్న భక్తులు



మంగళగిరి: గండబేరుండ జ్వాలా దీపాన్ని వెలిగిస్తున్న మంత్రి నారా లోకేశ్



కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో జ్వాలాతోరణం

నరసరావుపేట, అమరావతి, బాపట్ల, పెదకాకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శైవక్షేత్రాలు, కృష్ణానది, సముద్ర తీర ప్రాంతాలు, గృహాలు దీపాల వెలుగులతో కాంతులీనాయి. హరహర మహాదేవ శంభోశంకర నామస్మరణతో ఆలయాలు, నదీ, సముద్ర తీర ప్రాంతాలు మారుమ్రోగాయి. కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతోనూ, ఉత్సాహంగా శుక్రవారం జరుపుకున్నారు. భక్తులతో జిల్లాలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. కృష్ణానదీ తీరంతో పాటు బాపట్ల జిల్లా పరిధిలోని సముద్ర తీరం భక్తులతో పోటెత్తింది. పుణ్యస్నానాలాచరించిన భక్తులు కార్తీక దీపారాధనలు చేసి గౌరమ్మకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పౌర్ణమిని పురష్కరించుకుని ఆలయాల్లో రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జామునే ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద శివలింగాకరంలో కోటి దీపోత్సం నిర్వహించారు. కోటప్పకొండ, అమరావతి, పెదకాకాని ఆలయాల్లో స్వామివార్ల దర్శనాలకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణాల్లో కోటి దీపోత్సవం, జాల్వా తోరణం కార్యక్రమాలను భక్తులు తిలకించి పులకించిపోయారు.

- కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అభిషేకాల నిర్వహించి కోటయ్య స్వామికి విశేష అలంకారం చేశారు. వేలాది భక్తులతో గిరి ప్రదక్షణ కోలాహలంగా సాగింది. రాత్రి నేత్రపర్వంగా జ్వాలా తోరణం జరిగింది. ఈ సందర్భంగా స్వామికి అఖండ పూజ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.
- పంచారామ పుణ్యక్షేత్రాల్లో ప్రథమ ఆరామమైన అమరారామం అమరావతికి భక్తులు పోలెత్తారు. తెల్లవారుజామున నుంచే భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. బాణలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు స్వామివార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించి, కృష్ణవేణికి చీర సారె సమర్పించారు. దూప, పంచ, నంది, కుంభ, నక్షత్ర, కర్పూర హారతులను నదీమాతకు సమర్పించగా స్నానఘాట్ల నుంచి వేలాది మంది భక్తులు కనులారా వీక్షించారు. విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన హంస వాహనంపై బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి తెప్పోత్సవం కృష్ణానది అలలపై కన్నుల పండువగా జరిగింది.
- ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక జనసంద్రంతో పులికించింది. పెద్దసంఖ్యలో భక్తులు తీరంలో దీపాలను వెలిగించి సముద్రుడికి, తారకేశ్వరస్వామి, శ్రీఆంజనేయస్వామిలకు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు లక్ష మంది భక్తులు తీరంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. తీరంలో సాగరహారతి అట్టహాసంగా జరిగింది. తీరం ఒడ్డున ఏర్పాటు చేసిన శివలింగానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ దంపతులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల సమక్షంలో సముద్రుడికి సాగర హారతులను ఇచ్చారు.
- పెదకాకాని మల్లేశ్వరస్వామి సన్నిధి కార్తీక దీపాల వెలుగులతో నిండిపోయింది. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపారాధనలు చేశారు. హైకోర్టు విశాంత్ర న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకునిని అభిషేక సేవలో పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి సందర్భంగా సూర్యలంక తీరానికి పోటెత్తిన భక్తులు



బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



అమరావతి: కృష్ణమ్మ అలలపై కార్తీకదీపాలు వదులుతున్న భక్తులు

నరేంద్ర వర్గం.. నిర్వేదం



- చీఫ్‌విప్ పదవి ఆశించి ధూళిపాళ్ల భంగపాటు
- విప్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే నరేంద్ర విముఖత
- రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు మొక్కుబడిగా హాజరు
- తమ నేతకు అన్యాయం జరిగిందని అనుయాయుల అసంతృప్తి

గుంటూరు, పొన్నూరుటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నుంచి ఆరు సార్లు విజయం సాధించి పార్టీ కోసం అహరహం శ్రమించే తమ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు కూటమి ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం దక్కలేదని నియోజకవర్గ టీడీపీ శ్రేణులు నిర్వేదంలో ఉన్నారు. నరేంద్రకు అన్యాయం జరిగిందంటూ రెండు రోజులుగా వివిధ సామాజిక వర్గాల నేతలు పత్రికా ప్రకటనలతో తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఈ పర్యాయం చంద్రబాబు కేబినెట్‌లో నరేంద్రకు చోటు దక్కుతుందని, ఆ తర్వాత కీలక పదవి వస్తుందని ఆశించి భంగపడ్డారు. 2014లో ఐదో సారి గెలుపొందినప్పుడే నరేంద్రకు మంత్రి పదవి ఖాయమని భావించారు. అప్పట్లో టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు తమకు ఇవ్వకపోయినా పర్వాలేదు.. నరేంద్రకు ఇవ్వడానికి వీల్లేదని అడ్డుపడ్డారు. సంగం డెయిరీ ఛైర్మన్‌గా నరేంద్ర వ్యవహరిస్తున్నందున ఆయనకు ప్రత్యేకంగా మంత్రి ఇవ్వాల్సిన అవసరం లేదనే సాకు కూడా ప్రత్యర్థి వర్గం లేవనెత్తుతున్నది. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన నరేంద్ర ఐదేళ్లుగా పార్టీకి కొమ్ముకాస్తూ అధినేత చంద్రబాబుకు అండగా ఉంటూ వచ్చారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆయనపై నిత్యం విమర్శలు చేస్తూ ఒక దశలో జగన్ నా వెంట్రుక కూడా పీకలేడని విమర్శించి 32 రోజులు జైలు పాలయ్యారు. అయినా వెరవకుండా వైసీపీ ప్రభుత్వ తీరుపై పోరాటం ఆపలేదు. ఈ పర్యాయం ఆరో సారి నరేంద్ర విజయాన్ని సాధించగా తొలుత మంత్రి వర్గంలో చోటు లభిస్తుందని ఆయన అనుయాయులు భావించారు. అయితే కుల సమీకరణల్లో భాగంగా అవకాశం దక్కలేదు. ఆ తర్వాత చీఫ్‌విప్ పదవి దాదా పు ఖాయమని ప్రచా రం జరిగింది. అయితే పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి పదవి

(మిగతా 6వ పేజీలో..)

షాపులు పడగొడతారా.. ఒక్కొక్కరి సంగతి తేలుస్తా

- ఎంపీడీవోకి చిరుమామిళ్లలో వైసీపీ నేత బెదిరింపులు

పత్తి కొనుగోలుకు సాకులు చెప్పొద్దు

- తేమశాతంతో పని లేకుండా రైతులకు న్యాయం చేయండి
- దళారుల చెంతకు వెళ్లేలా చేయొద్దు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- రైతుకు నష్టం జరిగితే ఊరుకోం : ఎమ్మెల్యే బూర్ల



సీసీఐ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

ఆటోనగర్.. ఇచట అన్నీ దొరుకును



- గుంటూరులో అతిపెద్ద ఆటోమొబైల్ స్పేర్ పార్ట్ మార్కెట్
- ఆటో మొదలు లారీల వరకూ.. ఏ విడిభాగాలైనా ఇక్కడే..
- వేల కోట్ల టర్నోవర్.. వేలాదిమందికి ఉపాధి కేంద్రంగా ఆటోనగర్
- లారీలు, ట్యాంకర్లను సైతం తుక్కు చేసే సామర్థ్యం మెకానిక్‌ల సొంతం

8

6 ఏఎన్‌యూ ఎల్ఎల్‌బీ ఆనర్స్ డిగ్రీ ఫలితాలు విడుదల

భళా.. బాలోత్సవ్

- నేత్రానందంగా వీవీఐటీ కళాశాల ప్రాంగణం
- పోటా పోటీగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు
- అబ్బుర పరుస్తున్న నాటికలు

8



పులివెందుల ప్రజలకు జగన్ సమాధానం చెప్పాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి గైర్హాజరవుతున్న జగన్మోహన్‌రెడ్డి ప్రవర్తనపై ప్రజలు మరోసారి ఆలోచన చేయాలని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా లేకపోతే సభకు రానని అనడం కరెక్టు కాదన్నారు. ఆయన అసెంబ్లీకి రాకపోవటం వలన మాకేమీ నష్టం లేదనీ, ఆయన నియోజకవర్గ ప్రజలకే నష్టం అని తెలిపారు. జగన్‌రెడ్డిని గెలిపించిన పులివెందుల ప్రజలకు ఆయన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జగన్‌రెడ్డి అసెంబ్లీకి రాకపోగా, ఆయన పార్టీ ఎమ్మెల్యేలను కూడా అసెంబ్లీకి వెళ్లవద్దని చెప్పడం ఆయన పెత్తందారి మనస్తత్వానికి నిదర్శం అన్నారు. ఇప్పటికే అసెంబ్లీ సగం రోజులు గడిచి పోయాయని, మిగిలిన ఐదారు రోజులైనా సభకు రావాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేల హక్కులను జగన్‌రెడ్డి హరించ వద్దని హితవు చెప్పారు.

ఏఎన్‌యూ ఎల్ఎల్‌బీ హానర్స్ డిగ్రీ ఫలితాలు విడుదల

పెదకాకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగంలో నిర్వహిస్తున్న మొదటి ఏడాది బీఏఎల్ఎల్‌బీ హానర్స్ బీబీఏ ఎల్ఎల్‌బీ హానర్స్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను శుక్రవారం తాత్కాలిక వీసీ ఆచార్య కె.గంగాధర రావు, తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి విడుదల చేశారు. బీఏ ఎల్ఎల్‌బీ హానర్స్‌లో 25 మందికి 24 మంది, బీబీఏ ఎల్ఎల్‌బీ హానర్స్ కోర్సులో 25 మందికి 23 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాద్‌రావు తెలిపారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 19 లోగా ఒక్కొక్క పేపర్‌కు రూ.1820 చెల్లించి దరఖాస్తులను పంపాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాధిపతి ఆచార్య ఎల్. జయశ్రీ, బీవోఎస్ ఛైర్మన్ ఆచార్య ఎన్.రంగయ్య, విభాగం అధ్యాపకులు ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ జి.సతీష్ కుమార్ బి.శ్రీరామ్ కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

న్యూగుంటూరు మీదగా శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే యాత్రికుల రద్దీ దృష్ట్యా న్యూగుంటూరు రైల్వేస్టేషన్ మీదగా శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. నంబరు. 07145 మచిలీపట్నం - కొల్లాం స్పెషల్ ఈ నెల 18, 25 తేదీల్లో మధ్యాహ్నం 3.15కి బయలుదేరి సాయంత్రం 6 గంటలకు న్యూగుంటూరు, 6.48కి తెనాలి, రాత్రి 7.22కి బాపట్ల, 7.38కి చీరాల, మరుసటి రోజు సాయంత్రం 6.35కి కొట్టాయం, రాత్రి 7.27కి చెంగనూరు, 9 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. నంబరు. 07146 కొల్లాం - మచిలీపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 20, 27(బుధవారం) తేదీల్లో వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి గురువారం వేకువజామునకు ముందు 1.18కి చీరాల, 1.28కి బాపట్ల, 2.08కి తెనాలి, 2.50కి న్యూగుంటూరు, ఉదయం 7 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది.

తెనాలి, బాపట్ల, చీరాల మీదగా మరికొన్ని రైళ్లు

ఈ నెల 22, 29 (శుక్రవారం) తేదీల్లో నంబరు. 07143 మౌలాలి - కొల్లాం రైలు ఉదయం 11.30కి బయలుదేరి కాజీపేట మార్గంలో ప్రయాణించి రాత్రి 7.48కి తెనాలి, 8.28కి బాపట్ల, 8.48కి చీరాల, మరుసటి రోజు సాయంత్రం 5.05కి కొట్టాయం, 5.46కి చెంగనూరు, రాత్రి 7 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. నంబరు. 07144 కొల్లాం - మౌలాలి రైలు ఈ నెల 24, డిసెంబరు 1 (ఆదివారం) ప్రారంభ సమయం (శనివారం అర్ధరాత్రి దాటాక) 2.30కి బయలుదేరి సోమవారం వేకువజామునకు ముందు 12.48కి చీరాల, 12.58కి బాపట్ల, 1.28కి తెనాలి, ఉదయం 10 గంటలకు మౌలాలి చేరుకొంటుంది.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు నడపాలి

జనవరి నెలలో జరగనున్న కుంభమేళాకు గుంటూరు నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రతిపాదించాలని జెడ్ఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఉప్పలూరి శశిధర్ చౌదరి గుంటూరు డీఆర్ఎంకు లేఖ రాశారు. కుంభమేళా జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరగనుందన్నారు. గంగా పుష్కరాల సమయంలో గుంటూరు - బనారస్ ప్రత్యేక రైలుని మూడు ట్రిప్పులు నడపగా యాత్రికుల నుంచి విశేష ఆదరణ లభించింది. అలానే తాజాగా గుంటూరు మీదగా నడుపుతున్న సికింద్రాబాద్ - లక్నో గరీబ్‌రథ్ రైలుకు కూడా ప్రయాణికుల నుంచి డిమాండ్ ఏర్పడిందన్నారు. దీని దృష్ట్యా కుంభమేళాకు సాధ్యమైనన్ని ఎక్కువ ట్రిప్పుల్లో ప్రత్యేక రైలుని ప్రతిపాదించాలని విజ్ఞప్తి చేశారు.

పత్తి కొనుగోలుకు సాకులు చెప్పొద్దు

● తేమశాతంతో పని లేకుండా రైతులకు న్యాయం చేయండి
● దళారుల చెంతకు వెళ్లేలా చేయొద్దు
● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
● రైతుకు నష్టం జరిగితే ఊరుకోం : ఎమ్మెల్యే బూర్ల



సీసీఐ కేంద్రంలోని పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'పత్తి రైతులకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర వచ్చినా ఎకరాకు రూ.20 వేల వరకు నష్టపోతారు. అటువంటి పరిస్థితిలో సీసీఐ కేంద్రానికి వచ్చిన పత్తి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి వెళ్లటానికి వీల్లేదు. అవసరమైతే తేమ శాతం కొద్దిగా ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేయండి. ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులు దిక్కుతోచని స్థితిలో దళారుల వద్దకు వెళ్లటానికి వీల్లేదు. పత్తి కొనకుండా ఉండటానికి సాకులు చెప్పొద్దు' అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలోని గాయత్రి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పెమ్మసాని పత్తి రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. తేమశాతం ఎక్కువగా ఉందని పత్తిని కొనుగోలు చేయటం లేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పత్తి కొనుగోలుకు వివిధ రకాల సాకులు చెబుతున్నారని తెలిపారు. రైతులు వాస్తవానికి పత్తిని ఆరబెట్టే సీసీఐకి తెస్తారని, అయితే ఈ ఏడాది వాతావరణం అంత అనుకూలంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి సాగు చేసిన రైతుల్లో చాలామంది కౌలుదారులు ఉన్నారని, వారికి పంటను నిల్వ చేసుకునేందుకు సరైన వసతి లేదని తెలిపారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేయటం వల్ల సీసీఐకి జరిగే నష్టం ఏమిటని మంత్రి బయ్యర్‌ను ప్రశ్నించారు. తేమశాతం ఎక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేయటం వల్ల జిన్నింగ్ వేసిన తర్వాత రంగు మారుతుందని, బరువులో కూడా తేడా వస్తుందని బయ్యర్, సీసీఐ అధికారులు మంత్రికి చెప్పారు. అనంతరం మంత్రి అప్పటికే అక్కడకు రైతులు తీసుకువచ్చిన పత్తిలో ఉన్న తేమ శాతాన్ని పరిశీలించారు. ఒకే లాట్‌లో నాలుగు సార్లు తేమశాతం చూడగా, మూడుసార్లు 12 శాతం, ఒకసారి 15 శాతం ఉన్నట్లు రావడంతో కేంద్ర మంత్రి సైతం ఆశ్చర్య పోయారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి రైతులు కష్టాల్లో ఉన్న సంగతిని గుర్తెరిగి వారికి సీసీఐ న్యాయం చేయాలని అన్నారు. తేమ ఎక్కువగా ఉందని పత్తిని సీసీఐ కొనకపోతే రైతు దాన్ని మళ్లీ ఎక్కడకో తీసుకువెళ్లాలంటే రవాణా ఖర్చు తడిసి మోపెడు అవుతుందన్నారు. దళారులకు విక్రయించే పరిస్థితి రాకుండా చూడాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరుగుతూ ఉంటే తాను చూస్తూ కూర్చోనని స్పష్టం చేశారు. తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులకు సూచించారు. తరుగు పేరుతో కోతలు విధించవద్దని అన్నారు. గుంటూరు జిల్లాలో 52 వేల హెక్టార్లలో, 8.40 లక్షల టన్నుల పత్తి పంట వచ్చే అవకాశం ఉన్నందున సీసీఐ రైతుల పక్షాన నిలబడి మేలు చేయాలని సూచించారు.

అన్ని సెంటర్లు తెరవాల్సిందే

పేరుకు రాష్ట్ర వ్యాప్తంగా 33 సెంటర్లు ఉన్నట్లు చెబుతోందని, తెరిచింది మాత్రం రెండు, మూడు సెంటర్లు మాత్రమేనని ఎమ్మెల్యే రామాంజనేయులు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని వద్ద ప్రస్తావించారు. వెంటనే సీసీఐ మేనేజర్ అమర్నాథ్ రెడ్డితో మంత్రి పెమ్మసాని ఫోన్‌లో మాట్లాడారు. ఎన్ని సెంటర్లు అయితే జిన్నింగ్‌కు టెండర్లు దక్కించుకున్నాయో వాటన్నింటినీ వెంటనే తెరవాలని సూచించారు. ఎవరికి ఎక్కడ ఇష్టం ఉంటే అక్కడ అమ్ముకునే అవకాశం కల్పించాలని సూచించారు.

కేంద్రం దృష్టికి మిర్చి ధర సమస్య

ఈ సందర్భంగా మిర్చి రైతులు కొందరు రోజు రోజుకు ధర పతనం అవుతుందని కేంద్ర సహాయ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఏడాది పంట తక్కువగా ఉన్న ధర పతనం అయిందని ఎమ్మెల్యే రామాంజనేయులు వివరించారు. ఈ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు. అవసరం అయితే మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరారు.

ఎరువుల వ్యాపారులు పద్ధతి మార్చుకోవాలి

ఎరువుల షాపుల్లో బస్తాకు రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారని కొందరు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దానిపై మంత్రి స్పందిస్తూ ఎరువుల వ్యాపారులు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో జేసీ భార్గవ్ తేజ, మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, డీఏవో నున్న వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఏడీ రాజబాబు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల చేతుల్లోకి విద్యుత్ రంగం

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మాట్లాడుతున్న నర్సింగరావు, పాల్గొన్న సీపీఎం నాయకులు

గుంటూరు (తూర్పు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బడా పెట్టుబడిదారులకు విద్యుత్ రంగాన్ని అప్పజెప్పటమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ), యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (యూఈసీడబ్ల్యూయూ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో 'విద్యుత్ రంగం - ప్రభుత్వ విధానాలు - సవాళ్లు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. యూఈఈయూ, యూఈసీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు, జె.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ రంగం ఆస్తుల విలువ రూ. 82 లక్షల కోట్లనీ, దీనిని అంబానీ, అదానీ వంటి బడా పెట్టుబడిదారులకు అప్పగించటానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. చండీగఢ్, మహారాష్ట్ర పలు రాష్ట్రాల్లో పెట్టుబడిదారులకు అప్పగించటాన్ని ఉద్యోగులు అడ్డుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం మోపారని శ్వేత పత్రంలో పేర్కొన్న చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక భారాలు తగ్గించారా అని ప్రశ్నించారు. నాలుగు నెలల్లోనే రూ. 6 వేల కోట్లపైగా ట్రూప్ చార్జీలు పెంచారని, మరో రూ. 11వేల కోట్లు పెంచటానికి సిద్ధం అయ్యారన్నారు. గత ప్రభుత్వం హయాంలో షిరిడి సాయి కంపెనీతో జరిగిన ఒప్పందాల్లో అవినీతి జరిగిందని ఆరోపించారనీ, మరి అదే కంపెనీని ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ, కూటమి ప్రభుత్వాలు రెండూ ప్రజలపై భారాల విషయంలో ఒకటేనని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ రంగాన్ని పరిరక్షించుకోవటానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సదస్సులో నాయకులు ముజఫర్ అహ్మద్, కె.ఉమామహేశ్వరరావు, నాగబ్రహ్మచారి, వై.నేతాజి, ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

నరేంద్ర వర్గం.. నిర్వేదం

(5పేజీ తరువాయి)

కూడా లేకపోవడంతో ఆ ప్రాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు ఆలోచన చేయడంతో నరేంద్ర పేరు వెనక్కు వెళ్ళిపోయింది. వినుకొండ నుంచి గెలుపొందిన జీవీ ఆంజనేయులును చీఫ్‌విప్ పదవి వరించింది. ఈ క్రమంలో నరేంద్రకు విప్ పదవి ఇస్తామని ప్రతిపాదించగా ఆయన సుముఖత వ్యక్తం చేయనట్లు తెలిసింది. కేబినెట్ హోదా స్థాయి పదవిని ఆశిస్తున్నట్లు నరేంద్ర అధిష్ఠానానికి తెలియజేసినట్లు సమాచారం. కాగా నరేంద్రకు చీఫ్‌విప్ పదవి రాలేదని తెలిసినప్పటి నుంచి పార్టీ శ్రేణులు అసంతృప్తి గళం వినిపిస్తున్నాయి. నరేంద్ర కూడా కొంత మనస్థాపానికి గురై రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు మొక్కుబడిగా హాజరవుతున్నారు.

ప్రతిసారీ నిరాశే

రాష్ట్ర ప్రభుత్వ పదవుల పందేరంలో పొన్నూరు నియోజకవర్గానికి సరైన ప్రాధాన్యం లభించడంలేదని టీడీపీ శ్రేణులు అసంతృప్తి, ఆవేదనకు గురవుతున్నాయి. నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా నిలిపిన ఘనత ధూళిపాళ్ల కుటుంబానిది. ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పొన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికై 1989 వరకు రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో రోడ్డు ప్రమాదంలో వీరయ్యచౌదరి మృతి చెందగా ఆయన వారసుడిగా నరేంద్ర రాజకీయ ఆరంగేట్రం చేశారు. ఆయన వరసుగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైయ్యారు. 2019 ఎన్నికలో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా తిరిగి 2024లో అఖండ విజయాన్ని సాధించారు. అయితే ప్రతిసారి నరేంద్ర పేరు మంత్రి పదవి రేసులో ఉండటం భంగపడటం నరేంద్రతో పాటు ఆయన అనుయాయులకు పరిపాటిగా మారింది. వీరయ్యచౌదరి తర్వాత 35 ఏళ్లగా నియోజకవర్గానికి అమాత్య యోగం దక్కలేదు. నామినేటెడ్ పదవుల్లో సైతం పొన్నూరుకు సరైన ప్రాధాన్యం లేదని కార్యకర్తలు తీవ్ర నిరాశతో ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు 45 క్లస్టర్ పాయింట్లు

గుంటూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు గుంటూరు జిల్లాలోని 156 రైతు సేవా కేంద్రాలను 45 క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ వెల్లడించారు. ఖరీఫ్ 2024-25 గానూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గ్రేడ్-ఎ రకానికి క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,300 చెల్లించనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ భవనంలో 2024-25 ఖరీఫ్ కాలానికి సంబంధించిన ధాన్యం కొనుగోలు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోతాలు, కల్లాల వద్ద ధాన్యం వాహనాల్లోకి ఎక్కించటానికి కూలీలకు ఇవ్వాల్సిన హమాలి ఖర్చు, మిల్ పాయింటుకు చేర్చడానికి రవాణా ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఒకవేళ రైతులు సొంతంగా ఈ ఖర్చులు భరిస్తే ధాన్యం ఖరీదుతో పాటు సదరు సొమ్ము అకౌంట్లో 21 రోజుల్లోపు జమ చేస్తామన్నారు. ధాన్యం రవాణా జీపీఎస్ అమర్చిన వాహనాల్లో మాత్రమే చేయటం ద్వారా మిల్లు పాయింట్‌కు చేరే వరకు అధికారులు పర్యవేక్షించనున్నట్లు తెలియజేశారు. ధాన్యం రవాణాకి సంబంధించి రైతులు ఇబ్బంది పడకుండా, రవాణా శాఖ ముందుగానే జీపీఎస్ అమర్చిన వాహనాలు కొన్ని అందుబాటులో ఉంచాలని జేసీ ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యము, రైతు సేవ కేంద్రం నుంచి మిల్ పాయింట్‌కు చేరిన తదుపరి, అక్కడ మిల్లు యజమానులు రైతు సేవ కేంద్రంలో సాంకేతిక సిబ్బందిచే ధ్రువీకరించిన నాణ్యతా ప్రమాణాలపై అభ్యంతరాలను లేవనెత్తి, సమస్య సృష్టించకుండా కస్టోడియన్ అధికారి నియంత్రించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ, బిజినెస్ మేనేజర్ హరిగోపాలం ప్రసంగించారు.

ఎరువు కాదది ఉప్పు

● ల్యాబ్ పరీక్షల్లో తేలింది ఇదే..
● ఆర్గానిక్ పేరిట రైతులకు టోకరా పెట్టాలనుకున్న కేటుగాళ్లు



ఆర్గానిక్ ఎరువులుగా చెబుతున్న ప్యాకెట్లను ల్యాబ్ పరీక్ష నిమిత్తం స్వాధీనం చేసుకుంటున్న అర్బన్ ఏవోలు (ఫైల్ ఫొటో)

గుంటూరు సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైతులను బురిడీ కొట్టించాలనుకున్న కేటుగాళ్ల గుట్టు రట్టయింది. ఆర్గానిక్ ఎరువుల పేరిట చెలామణి చేస్తున్న వాటిలో ఉప్పు తప్ప మరేమీ లేదని తేలింది. సెప్టెంబరు 10వ తేదీన నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వీఆర్ఎల్ పార్సిల్‌లో వ్యవసాయ అధికారులు రూ.13.68 లక్షల విలువ చేసే 6వేల కిలోల బరువు కలిగిన ఆర్గానిక్ ఎరువులను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. 28.28.0, 00.52.34, 20.20.20, 13.0.45, 12.61.0, 13.40.13, 19.19.19, 13.0.45, 0.0.45 రకాల ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారుల ప్రత్యేక తనిఖీల్లో భాగంగా పార్సిల్ కార్యాలయంలో పెద్ద మొత్తంలో ఆర్గానిక్ ఎరువుల పేరిట చెలామణిలోకి వచ్చిన నకిలీలను స్వాధీనం చేసుకున్నారు. వాటిల్లో 6 నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ పరీక్షల్లో ఆరు నమూనాలు అవి అసలు ఎరువులే కాదని తేలింది. మార్కెట్‌లో అతి తక్కువ ధరకు లభ్యం అయ్యే ఉప్పు(సోడియం సల్ఫేటు)అని నిర్ధారించినట్లు తెలిసింది. వాటి వినియోగం వల్ల రైతులకు మేలు జరగక పోగా, భూమికి నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం ల్యాబ్ పరీక్షలు ఆధారంగా తేలిన దాని ప్రకారం వాటిల్లో వాడిన ముడి పదార్థాల విలువ రూపాయిల్లో ఉంటుంది.

నేడు మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభం

● హాజరుకానున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత

గుంటూరు (విద్య), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందించే డీఎస్సీ ఉచిత శిక్షణను బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత నేడు గుంటూరులో లాంఛనంగా ప్రారంభించనున్నారు. స్థానిక రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ప్రారంభించిన అనంతరం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగే సమావేశంలో మంత్రి సవిత పాల్గొంటారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మయూరి పాల్గొంటారు.

ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్

గుంటూరు(విద్య), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సూర్యటెక్ సొల్యూషన్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.4 లక్షల ప్యాకేజీ కంపెనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్, కె.మద్దినేని, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను సజావుగా పరిశీలించాలి

గుంటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నిక కోసం జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని టీడీపీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, టీడీపీ నాయకుడు తిలక్ తదితరులు కలెక్టరేట్‌కు వచ్చి ఈఆర్వో ఎస్ఎస్‌కే కాజావలిని కలిసి చర్చించారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. కొంతమంది బీఎల్‌వోలు ఓటరు దరఖాస్తుల పరిశీలనకు వెళ్లినప్పుడు అటెస్టు చేసిన సర్టిఫికెట్ల కాపీలు అడుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలానే 10+2+3లో డిగ్రీ పాస్ అయ్యారా, లేదా అని కూడా ప్రశ్నిస్తున్నారని, కొందరైతే 10, ఇంటర్ సర్టిఫికేట్లు కూడా చూపమంటున్నారని చెప్పారు. దీనిపై ఈఆర్వో కాజావలి స్పందించి తాను బీఎల్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడానని చెప్పారు. ఈఆర్వో మాట్లాడుతూ దరఖాస్తుదారుడు నివేదించిన సర్టిఫికేట్లలో ఏమైనా అనుమానాలు ఉంటేనే ఒరిజినల్స్ చూపమని కోరాలని ఆదేశించామన్నారు. ఎవరైనా బీఎల్‌వో నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికేట్లు, అటెస్టెడ్ కాపీలు అడిగినట్లయితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. 3.30 లక్షల దరఖాస్తుల్లో 1.40 లక్షల పరిశీలన పూర్తి అయిందని, వాటిల్లో లక్ష ఆన్‌లైన్‌లో అప్‌లోడింగ్ చేశామన్నారు. ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తుల పరిశీలన ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించామన్నారు.

షాపులు పడ గొడతారా.. ఒక్కొక్కరి సంగతి తేలుస్తా

● వైసీపీ నేత బెదిరింపులు



చిరుమామిళ్లలో అక్రమంగా నిర్మించిన షాపులను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

నాదెండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'ఆ స్థలం నాది.. షాపులు పడగొడతారా.. ఒక్కొక్కరి సంగతి తేలుస్తా' అంటూ చిరుమామిళ్ల గ్రామానికి చెందిన వైసీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి బెదిరింపులకు దిగారు. మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలో చెరువు పోరంబొకు అక్రమ రిజిస్ట్రేషన్, ఆ స్థలంలో నిర్మాణం చేసిన షాపింగ్ కాంప్లెక్స్‌పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో స్వరూపరాణి శుక్రవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా స్థలాన్ని కొనుగోలు చేసి షాపులు నిర్మించిన మేకల రామిరెడ్డితోపాటు ఫిర్యాదుదారులు భవనం శ్రీనివాసరెడ్డి, ఘంటా హరికృష్ణలను పంచాయతీ కార్యాలయంలో విచారణకు పిలిచారు. శ్రీనివాసరెడ్డి, హరికృష్ణలను విచారణ చేస్తున్న సమయంలో కోటిరెడ్డి కార్యాలయానికి వచ్చారు. ఫిర్యాదుదారులతో పాటు తదితరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భవనం శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకొని కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పుల్లారావు సిబ్బందితో గ్రామానికి వచ్చారు. ఈలోగా కోటిరెడ్డి కార్యాలయం నుంచి బయటకు వెళ్లారు. అనంతరం ఎంపీడీవోకు అక్రమ నిర్మాణానికి సంబంధించిన ఫిర్యాదుదారులు అందజేశారు. విచారణలో సర్వేయర్ రాంబాబు, వీఆర్వో, కార్యదర్శి ప్రేమరాజు, ఠాకూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనం చేసుకుని వస్తుండగా మృతి



సుబ్బారావు (ఫైల్)

రెంటచింతల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం చేసుకుని వస్తుండగా జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రెంటచింతల గ్రామానికి చెందిన దండే సుబ్బారావు(38) కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గురజాల మండలం దైద అమరలింగేశ్వర స్వామి దర్శనానికి బంధువులు, మిత్రులతో కలిసి ఆటోలో వెళ్లారు. అక్కడ కృష్ణానదిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్న అనంతరం శుక్రవారం సాయంత్రం ఆటోలో రెంటచింతలకు బయలు దేరారు. కొద్ది నిమిషాలకే మూల మలుపు వద్ద ఆటో బోల్తా పడడంతో దండే సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య లక్ష్మీప్రసన్న, కుమారుడు ఉన్నాడు.

కొండ్రముట్ల సచివాలయంలో చోరీ

ఈపూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రముట్ల సచివాలయంరైతు సేవా కేంద్రం, ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో చోరీ జరిగింది. శనివారం ఉదయంసచివాలయం ఉద్యోగులు కార్యాలయానికి వచ్చే సరికి గది తలుపు తాళం పగలకొట్టి ఉంది. అందులో ఉన్న కంప్యూటర్లు, యూపీఎస్‌లు, బ్యాటరీలు, ప్రింటర్లు, విలువైన కేబుల్స్, ఎలక్ట్రికల్ పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు సెక్రటరీ ఏఎన్ రత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

40,639 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 36,928 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,639 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,602 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15600	334	10000	15000
నెంబరు. 5	8200	12500	నెంబరు. 5	12500	15000
273	10000	12000	273	--	--
341	8500	14000	341	9000	14500
4884	9000	12000	4884	11500	14500
సూపర్ 10	9000	10000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17000	తేజ	8000	17000
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	8500	14000
దేవనూరు డీలక్స్	9000	12500	దేవనూరు డీలక్స్	10000	13000
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4800	10500

జగన్ పద్ధతి మార్చుకోకపోతే ప్యాలెస్‌ను ముట్టడిస్తాం

● ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి

బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ విషయంలో ఆయన పద్ధతి మార్చుకోకపోతే ఉండవల్లిలోని ప్యాలెస్‌ను ముట్టడిస్తామని ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి హెచ్చరించారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన ఆమె శుక్రవారం బాపట్లలో పార్టీశ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాలు నిర్వీర్యం, మహిళల ఆర్థికాభ్యున్నతికి తీరని అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు అధ్యక్షత వహించగా మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, శీలం సాగర్, ఎస్‌వీఆర్ కుమార్, బి.రోశయ్య పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు

● ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్

రేపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తే ఉపేక్షించేదిలేదని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. ఆయన మాట్లాడుతూ సముద్ర తీరం వెంట గల మడఅడవుల్లో దాడులు నిర్వహించగా రెండు ప్రాంతాల్లో నాటుసారా తయారు చేసేందుకు ఉంచిన 400 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఈస్ట్ ఏఈఎస్ బి.వెంకటేశ్వరరావు, సీఐలు ఆర్.నరహరి, ఎస్.రామారావు, సిబ్బంది వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి, కె.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహనప కల్పించాలి

కర్లపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదపులుగువారిపాలెం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రికార్డులను పరిశీలించారు. ఎన్‌పిసిఐ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి పిల్లల సాంబశివరావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు పోసానిపై న్యాయవాది ఫిర్యాదు

బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లను అసభ్య పదజాలంతో దూషించిన సినీనటుడు పోసానీ కృష్ణమురళీపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది, అంబేద్కర్ సేవా సమాజం అధ్యక్షుడు దగ్గుమల్లి కిరణ్‌కుమార్ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ అర్.అహ్మద్ జానీకి ఫిర్యాదు చేసి అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణమురళీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుచిత పోస్టులపై కేసు నమోదు

అమృతలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రులు కొణిదెల పవన్‌కళ్యాణ్, నారా లోకేష్‌లపై అనుచిత వాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమర్‌వర్ధన్ తెలిపారు. కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన శ్యామ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టాడు. వీటిని చూసిన మండల పరిధిలోని తురుమెళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బేతాళ కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యాబోధనతో ఉపాధ్యాయులకు ఎనలేని గౌరవం

పిట్టలవానిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విలువలతో కూడిన విద్యాబోధన అందించే ఉపాధ్యాయులకు ఎనలేని గౌరవం దక్కుతుందని చందోలు గ్రామ ఆదర్శ అభ్యుదయ కమిటీ సభ్యులు అన్నారు. చందోలు గ్రామంలోని నీలిబంగారయ్య ఉన్నత పాఠశాలలో 8ఏళ్లపాటు ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన కొల్లిపర మురళీధరరావు దంపతులను ఆదర్శ గ్రామఅభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు రియాజ్ అహ్మద్, రఫీ మాస్టర్, జాగీర్ మహ్మద్, మస్తాన్‌బేగ్, రియాసత్ అలీఖాన్, మజ్హర్ బాషా, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు

బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజుల వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభించారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపుతో నేటి కాలంలో ఉన్న అడ్వాన్డ్ అప్లికేషన్స్ నాణ్యతను టెస్ట్ చేయ కలిగిన నాలెడ్జి పొందవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరి కొమ్మినేని హరిపద్మప్రసాద్, నల్లూరి శివరామప్రసాద్, కామిని శ్రీనివాసరావు, మువ్వా ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

భట్టిప్రోలు, (కొల్లూరు) నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేసినట్లు ఎస్ఐ శివయ్య శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేమూరు మండలానికి చెందిన బాలికను భట్టిప్రోలుకు చెందిన దేవరపల్లి అభిషేక్ అనే యువకుడు ఆటోలో కెఎస్‌కె కళాశాల సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు పైకి తీసుకువెళ్లి అత్యాచారం చేసినట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం వైద్యశాలకు పంపించి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. సిఐ వీరాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా సాగర హారతి

● పాల్గొన్న ఎమ్మెల్యేలు వేగేశన, జూలకంటి



సూర్యలంక తీరంలో సముద్రదేవునికి సాగర హారతి ఇస్తున్న ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి



సూర్యలంక తీరంలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్లరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా సూర్యలంక సముద్రతీరంలో సాగరహారతి కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. తీరం ఒడ్డున ఏర్పాటు చేసిన శివలింగానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితుల సమక్షంలో సముద్రదేవునికి వివిధ రకాల సాగర హారతులను ఇచ్చారు. సాగరహారతి కార్యక్రమానికి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని వేగేశన నరేంద్రవర్మతో కలిసి సాగర హారతులను ఇచ్చారు. సముద్రునికి హారతులిచ్చిన అనంతరం తీరంలో పుణ్యస్నానాలను ఆచరించారు. అనంతరం విలేకర్లతో ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ సూర్యలంక తీరానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్న తరుణంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారన్నారు. సూర్యలంకతీరంలో కార్తీక పౌర్ణమి వేడుకేకాకుండా రాబోయే రోజుల్లో బీచ్ ఫెస్టివల్ తోపాటు మరో రెండు, మూడు వేడుకలను కూడా నిర్వహించటం ద్వారా బీచ్ డెవలప్‌తోపాటు టూరిజం, టెంపుల్ టూరిజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పుణ్యస్నానాలను ఆచరించే సమయంలో భక్తులు, యువకులు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, బీజేపీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు భోజనం

కార్తీక పౌర్ణమి సందర్భంగా సూర్యలంక తీరానికి వచ్చే భక్తులకు వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్పాహార, భోజన వితరణ స్టాల్‌ను ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు ప్రారంభించి భక్తులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అదేవిధంగా జనసేనపార్టీ ఆధ్వర్యంలో సముద్రతీరానికి పుణ్యస్నానాలు ఆచరించటానికి వచ్చిన భక్తులకు, మాలధారణ స్వాములకు బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. వైసీపీ ఆధ్వర్యంలో భక్తులకు భోజన ఏర్పాటును నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని భక్తులకు భోజనాన్ని పంపిణీ చేశారు.

తీరంలో బందోబస్తును పరిశీలించిన ఎస్పీ

సూర్యలంక సముద్రతీరంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వచ్చే భక్తులకు భద్రతా దృష్ట్యా ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును ఎస్పీ తుషార్ డూడి స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని సముద్రతీరాల వద్ద, కృష్ణానది పరివాహక ప్రాంతాలలో, దేవాలయాలు ఇతర ముఖ్యమైన ప్రాంతాలలో జిల్లా పోలీసు అధికారులు శుక్రవారం పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా పటిష్ఠ బందోబస్తును తీరంలో ఏర్పాటు చేశామన్నారు.

వాహనాల పార్కింగ్ రుసుంపై భక్తుల అసంతృప్తి

బాపట్ల సూర్యలంక తీరంకు విచ్చేసే వాహనాల పార్కింగ్ రుసుం చెల్లించే విషయంలో భక్తులు అసంతృప్తికి గురయ్యారు. వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేసేందుకు శ్రీ ఆంజనేయస్వామి గుడి సమీపంలో టోల్ గేట్‌ను ఏర్పాటు చేశారు. అయితే సూర్యలంక తీరంకు రెండు కిలోమీటర్ల దూరం ఉండగానే వాహనాలను రోడ్లపై ఆపేసి వాహనాల రుసుంను కట్టించుకోవటంతో భక్తులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.



మోర్తోటలో పూజలు నిర్వహిస్తున్న శివప్రసాద్



జమ్ములపాలెంలోని రామాలయంలో భక్తులు ఏర్పాటు చేసిన కార్తీకదీపాలు



జంపని రామేశ్వరాలయంలో జ్వాలాతోరణ ఉత్సవం

శివనామస్మరణతో మారుమోగిన దేవాలయాలు

● కార్తీక పౌర్ణమి పూజలకు పోటెత్తిన భక్తులు

రేపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు పెనుమూడి, మోర్తోట కృష్ణానదిలో పుణ్యస్నానాలాచరించి కార్తీక దీపారాధనలు చేసి గౌరమ్మకు పసుపు, కుంకుమ పూజలు చేశారు. పెనుమూడి శివాలయం, రేపల్లె రైలుపేటలోని శ్రీ స్వయంభూ రామలింగేశ్వర స్వామి ఆలయం(శివాలయం), ఓల్డ్‌టౌన్ ఉమామహేశ్వరస్వామి ఆలయం, ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి, మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక దీపారాధనలుచేసి శివాలయాల్లో ఏకాదశ మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకం ఆలయ అర్చకులు నిర్వహించారు. నిజాంపట్నం మండలం దిండి సముద్రం వద్ద, హార్బర్‌లో వేలాదిగా భక్తులు సముద్రస్నానాలు ఆచరించి దీపారాధనలు చేశారు. మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో అనగాని శివప్రసాద్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. పుణ్యస్నానాలు ఆచరించి భక్తులకు టీడీపీ నాయకులు పులిహోర,చక్రపొంగలి,శనగలు ప్రసాదాన్ని అందించారు. డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, సీఐ సురేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు. చెరుకుపల్లి మండలంలోని గుళ్ళపల్లి, చెరుకుపల్లి, కన గాల, ఆరేపల్లి, కావూరు, శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీప మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేకంగా శివలింగాలకు అలంకరణలు చేశారు.

● బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం గ్రామంలో ఉన్న శ్రీ రామాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపార్చన చేశారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమాన్ని చిన్నపాటి వరప్రసాద్, కుర్రా వెంకటేశ్వరరావు, కాపు విజయప్రసాద్, రామినేని శ్రీనివాసరావు, అత్తేటి శ్రీనివాసరావు, కొమ్మినేని సుధా లక్ష్మి, కుర్రా లక్ష్మి, అత్తేటి ధనలక్ష్మి, పువ్వాడ ఉమాదేవి, పువ్వాడ గోవర్ధన్ తదితరులు పాల్గొని భక్తులకు వసతులు కల్పించారు.

● కర్లపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :కర్లపాలెం పంచాయతీ పరిధిలోని అగ్రహారంలో ఉన్న శ్రీ గంగా గౌరిసమేత బధరి కేదారేశ్వర శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పురోహితులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు.

● వేమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధి గ్రామాల్లోని శివ, విష్ణు ఆలయాలలో శుక్రవారం రాత్రి వార్షిక జ్వాలాతోరణ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అతి ప్రాచీనమైన చావలి వాలేశ్వరాలయం, వేమూరు రామలింగేశ్వర ఆలయం, జంపని రామేశ్వరాలయాలలో తెల్లవారుజామున స్వామివారికి నమక చమకాలు రుద్రం పంచసూక్తాలతో ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆలయ ప్రదక్షిణలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. సాయంత్రం జంపని చెన్నకేశవాలయం, గ్రామాలలోని శివాలయాలలో జ్వాలా తోరణ ఉత్సవాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఆవు నేతితో జ్వాలాతోరణం వెలిగించి ఉత్సవ మూర్తులను జ్వాలా తోరణం నుంచి ప్రదక్షిణలు చేయించారు. ఈ ఆలయ ఉత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివ, గోవింద నామస్మరణలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.


● కొల్లూరు, భట్టిప్రోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కొల్లూరులోని అనంతభోగేశ్వరస్వామి ఆలయం, చిలుమూరు ఉభయ రామేశ్వరక్షేత్రం, కోటిపల్లిలోని సోమశేఖరస్వామి ఆలయాలలోని స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కార్తీక దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు జరిపారు. చిలుమూరులో భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కోటిపల్లిలో రాత్రివేళ లక్ష పత్రి పూజ, జ్వాలాతోరణం నిర్వహించారు. ఆయా పూజాది కార్యక్రమాలను అర్చకులు జరిపించగా ఆలయ కార్య నిర్వహణాధికారులు పర్యవేక్షించారు.

● చుండూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చినపరిమిలోని శ్రీగంగాపార్వతి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయంలో విశేష పూజలు జరిగాయి. స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించి దీపారాధన చేశారు.

● అమృతలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని పలు ఆలయాల్లో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు శైవ క్షేత్రాల్లో వేకువజామున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. కూచిపూడి శ్రీరామలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అమృతలూరులోని శ్రీఅమృతేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం కోటి వత్తులతో ఏక దీపం వెలిగించారు. జ్వాలా తోరణం వెలిగించి స్వామి వారిని పల్లకిలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

సమాచార హక్కు చట్టంతో సుపరిపాలన

● రాష్ట్ర సమాచార కమిషనర్ శామ్యూల్ జోనాథన్



సదస్సులో మాట్లాడుతున్న పి.శామ్యూల్ జోనాథన్

బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంతో సుపరిపాలన లభిస్తుందని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్ తెలిపారు. పట్టణంలోని స్త్రీ శక్తి భవన్‌లో శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అధ్యక్షత వహించగా శామ్యూల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సద్వినియోగం ద్వారా పాలనలో పారదర్శకతను సాధించవచ్చు అన్నారు. దీని ద్వారా పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుందని చెప్పారు. సదస్సులో పౌరసమాఖ్యనాయకులు డాక్టర్ కె.విజయ్‌కుమార్, డాక్టర్ బి.శరత్‌బోస్, రమణకుమార్, జీవి, రవీంద్ర, ఆట్ల బాలాజీరెడ్డి, రాజారావు, శేఖర్, న్యాయవాదులు జమ్మద్‌బాషా, రామాంజనేయులు, భాస్కరరావు, గురజాల శ్రీనివాసరావు, హరిబాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ దేవాలయంలో హుండీ చోరీ

● రెండున్నర సవర్ల బంగారం అపహరణ



హుండీ నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

కర్లపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తనందాయపాలెంలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మమల్లేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కానుకల హుండీని, అమ్మవారి బంగారాన్ని దుండగులు అపహరించి హుండీని పొలాలలో వదిలి వెళ్ళారు. శుక్రవారం వేకువజామున దేవాలయంలో పూజలు నిర్వహించేందుకు వచ్చిన పూజారి పరిశీలించగా దేవాలయం తాళం పగలగొట్టి ఉండటం, అమ్మవారి మెడలో బంగారు మంగళసూత్రాలు చోరీకి గురయ్యాయి. హుండీని దుండగులు పొలంలో వదిలి వెళ్ళారు. బాపట్ల నుంచి క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. నిర్వాహకులు కావూరి ప్రసాదరెడ్డి, గ్రామ మాజీసర్పంచ్ రావి రాంబాబురెడ్డి పలువురు పెద్దలు కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి : ఎంపీడీవో

వేమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖల సమన్వయంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో శివన్నారాయణ సూచించారు. స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ యల్లమాటి మోహనరావు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ, పంచాయితీరాజ్‌చట్టం ద్వారా వివిధ సెక్షన్లలో సూచించిన ప్రకారంగా అభివృద్ధి ప్రణాళికలు ఆయా గ్రామాల స్థాయికి తయారు చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ ద్వారా విహంగ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటసురేష్‌బాబు, ఈవోపిఆర్‌డి శేఖర్, రిసోర్స్ పర్సన్స్ ఆంజనేయ ప్రసాద్, సాధిక్, గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి వెండితొడుగు సమర్పించిన శివప్రసాద్

రేపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : హరిహరసుతుడైన అయ్యప్పస్వామికి రెవెన్యూ శాఖా మంత్రి అనగానిసత్యప్రసాద్ సమకూర్చిన వెండితొడుగును శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అందించారు. తొలుత అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు శివప్రసాద్‌ను దుశ్శాలువాలతో సన్మానించి వేద ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు వేజళ్ళ కృష్ణమోహన్, యార్లగడ్డ చిన్నబాబు, గుర్రం మురహరిరావు, గుర్రం విజయలక్ష్మి, ఉసిరికాయల వీరబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ప్రథమస్థానం సాధించిన విద్యార్థినికి చెక్కును అందిస్తున్న కంతేటి రామకృష్ణ

రేపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించి వారికి అండగా నిలవాలని గ్రామస్థుడు కంతేటి రామకృష్ణ అన్నారు. మంత్రిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు రూ.15వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున శుక్రవారం నగదు పారితోషికం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నందికట్ల వెంకటేశ్వరరావు, కంతేటి చంద్రం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమరయోధుల పటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి తదితరులు

గిరిజనుల అభ్యున్నతికి అన్నివిధాలా కృషి : కలెక్టర్

బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అభ్యున్నతికి అన్నివిధాలా కృషి చేస్తామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. బిర్సాముండా జయంతిలో భాగంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను బిర్సాముండా, అల్లూరు సీతారామరాజు, గాము గంటదొర, గాము మల్లుదొర, బోనంగి పండుపడాల్, కుడుముల పెద్దబయ్యన్న, హనుమంతప్ప, కారంతమ్మన్నదొరల చిత్రపటాలకు కలెక్టర్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీలలోని యువత భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలంటే స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎస్టీల సమస్యల పరిష్కారానికి వివిధ సంఘాల నాయకులు పలు అంశాలు కలెక్టర్ దృష్టికి తీసుకురావటంతో ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సాధికారితాధికారి బి.ప్రకాశరావు, గిరిజన సంఘాల నాయకులు దేవరకొండ రాము, టి.మోహన్‌కుమార్ ధర్మా, శ్రీను, శంకరరావు, వెంకటేశ్వర్లు, ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రెండు ఇసుక రేవులను గుర్తించాం : కలెక్టర్

ఉచిత ఇసుక విధానంలో భాగంగా జిల్లాలో కొత్తగా రెండు ఇసుక రేవులను గుర్తించామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై మైన్స్‌శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరి ముఖేష్‌కుమార్ మీనా రాష్ట్ర రాజధాని నుంచి శుక్రవారం అన్నిజిల్లాల కలెక్టర్‌లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. నదులకు అనుకొని ఉన్న గ్రామాలలోని ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకెళ్ళటానికి మండలస్థాయి అధికారులు అనుమతులివ్వాలని తెలిపారు. డిసెంబరు 19న మరుగుదొడ్ల దినోత్సవం నేపథ్యంలో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకునేలా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ ఇసుక లభ్యత ఉన్న ప్రాంతాలను గుర్తించి పర్యావరణ అనుమతులు కొరకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. అనుమతులు రాగానే ఆ రేవులలో ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, మైన్స్‌ఏడి రాజేష్, అనంతరాజు పాల్గొన్నారు.

భక్తులపై శ్రీబగళాముఖి అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



ఎమ్మెల్యే నరేంద్రవర్మ దంపతులను సత్కరిస్తున్న నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీబగళాముఖి అమ్మవారి ఆశీస్సులు భక్తులపై మెండుగా ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ దంపతులు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేగేశన నరేంద్రవర్మ దంపతులను దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు, ఆలయ ఫెస్టివల్ అధికారి జి.నరసింహమూర్తి, ఆలయ పర్యవేక్షకులు కె.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి శేషవస్త్రంతోఘనంగా సత్కరించి వేద ఆశీర్వచనాలు అందజేశారు. శ్రీబగళాముఖి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు బాపట్ల నియోజకవర్గం కూడా సర్వతోముఖాభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండి అఫ్జల్, చందోలుగ్రామ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాశీం పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై పంచాయతీ రికార్డులు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో జ్యోతిబసు తదితరులు

భట్టిప్రోలు, (కొల్లూరు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీలో అవినీతి జరిగిందంటూ వచ్చిన ఆరోపణలపై కార్యాలయ అధికారులు తనిఖీ చేస్తున్నట్లు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు శుక్రవారం పేర్కొన్నారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ రికార్డులను గతంలో వచ్చిన ఫిర్యాదులపై మూడు నెలల క్రితం డిఎల్‌పివో స్వాధీనం చేసుకుని ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరిచారు. అప్పుడే ఒక బృందాన్ని ఏర్పాటు చేసి సుమారు 15 రోజుల పాటు 2009 నుంచి 2023 వరకు పంచాయితీ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను డిఎల్‌పివో నరసింహారావు ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. ప్రస్తుతం జడ్పీ సీఈవో నేతృత్వంలో మళ్లీ రికార్డులను పరిశీలన చేపట్టారు. పరిశీలన పూర్తి అయిన అనంతరం నివేదికను పంచాయితీరాజ్ కమిషనర్‌కు అందజేయనున్నట్లు సీఈవో తెలిపారు. తనిఖీల్లో పంచాయితీరాజ్ అధికారులు మంగపూర్‌నాథ్, ప్రసాద్, డిపివో కె.ప్రభాకరరావు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా సహస్ర కలశాభిషేకం



శ్రీగంగాపర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారికి పూజలు చేస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎన్‌పి అగ్రహారంలో ఉన్న శ్రీ గంగా పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి 100 సంవత్సరాల ప్రతిష్ఠ మహోత్సవ వార్షిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీజేపీనాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ప్రసాదస్వామి ఆధ్వర్యంలో గూడూరు చిట్టిబాబు, సాయివెంకట్, భీమవరపు సురేష్, పంగులూరి కౌండిన్యశర్మ, నెమలికంటి హనుమంతరావు, అక్కపెద్ది సుబ్రహ్మణ్యం, యల్లాగప్రగడ, సూర్యరమణలు నిర్వహించారు. ఆలయధర్మకర్త ఆదూరి హరినారాయణ, ఏడుకొండలు, కృష్ణభాస్కర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, బాపట్ల, పొన్నూరు మున్సిపల్ కమిషనర్లు జి.రఘునాథరెడ్డి, ముప్పాళ్ళ రమేష్‌బాబు, చీమకుర్తి సుధాకర్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల ఎత్తివేతతో ఏపీసీపీఎస్ఈఏ హర్షం

భట్టిప్రోలు, (కొల్లూరు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులపై మోపిన కేసులను ఎత్తి వేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించడంపై ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ హర్షం వ్యక్తం చేశారు. సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ, సీపీఎస్ ఉద్యోగులు 2022 సెప్టెంబరు 1వ తేదీన ఛలో విజయవాడ పిలుపు ఇవ్వడంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం వేలాది మంది సీపీఎస్ ఉద్యోగులపై కేసులు బనాయించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఏపీసీపీఎస్ఈఏ తరుపున తమపై ఉన్న కేసులను ఎత్తి వేయాలంటూ రాష్ట్ర మంత్రులను, అధికారులను కలిసి వినతి పత్రాలు అందించడం జరిగిందన్నారు. దీంతో శుక్రవారం అసెంబ్లీలో లోకేశ్ సీపీఎస్ ఉద్యోగులపై కేసులు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు హర్షం చేస్తున్నాయని ఆయన తెలిపారు.



ఆటోనగర్ ఇచ్చట అన్నీ దొరుకును..!

ఆటో పాడైపోయిందా.. విడి భాగాలు కావాలా? అయితే ఆటోనగర్ వెళ్లాల్సిందే! కారు.. జీపు.. లారీ.. కంటెయినర్.. ఇలా ఏది కావాలన్నా కేరాఫ్ అడ్రస్ గుంటూరు ఆటోనగర్! మారుతీ కారు మొదలు.. అతి ఖరీదైన ఇన్నోవా, స్కార్పియో, మహీంద్ర అది ఏ కారైనా.. ఏ బ్రాండైనా.. దానికి సంబంధించిన స్పేర్ పార్టులు కావాలా? అయితే ఆటోనగర్‌కు వెళ్లాల్సిందే! - అంతలా గుంటూరు ఆటోనగర్ తన ఖ్యాతిని, బ్రాండ్ ఇమేజీని పెంచుకుంది. గుంటూరు ఆటోనగర్లో స్పేర్ పార్టులు దొరకలేదా? ఇక రాష్ట్రంలో మరెక్కడా అవి దొరకకపోవచ్చు! అన్నంతగా విస్తరించింది. ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో గుంటూరు ఆటోనగర్ దినదిన ప్రవర్ధమానంగా ఎదిగి, గుంటూరుజిల్లాకే తలమానికంగా నిలిచింది. ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్లను ఒడిసి పట్టుకుంటూ, నవ్యత్వాన్ని సొంతం చేసుకుంటూ తన బ్రాండ్ ఇమేజిని అంతకంతకూ విస్తరించుకుంటూ ముందుకు సాగుతోంది గుంటూరు ఆటోనగర్. తాజా పరిస్థితుల నేపథ్యంలో కేవలం ఆటో మొబైల్ సేవలకే పరిమితం కాకుండా విభిన్న రంగాల్లో దూసుకు పోతోంది. వేల కోట్ల టర్నోవర్‌తో జిల్లాలోని వేలాది మందికి ఆటోమొబైల్ టెక్నీషియన్లు, మెకానిక్‌లకు జీవనోపాధిని అందిస్తోంది.

- అతిపెద్ద ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ మార్కెట్
- ఆటో మొదలు లారీల వరకూ.. ఏ విడిభాగాలైనా ఇక్కడే..
- లారీలు, ట్యాంకర్లను సైతం తుక్కు చేసే సామర్థ్యం
- వేల కోట్ల టర్నోవర్.. వేలాదిమందికి ఉపాధిగా ఆటోనగర్





గుంటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆటోనగర్ గురించి చెప్పాలంటే ముందుగా గుంటూరు మాయా బజార్ గురించి చెప్పాలి. ఎప్పుడో వంద ఏళ్ల క్రితం ఒక పదిమంది మోటార్ మెకానిక్కుల సమష్టి ఆలోచనతో పురుడుపోసుకున్న గుంటూరు మాయాబజార్ కాల క్రమంలో విస్తరించి పెద్దదయింది. పాత బస్టాండు సెంటర్లో నగరానికి నడిబొడ్డున వుండడంతో విస్తరించే వీలు లేకపోవడంతో అది నగర శివారుల్లో మరో విభాగంలో కార్యకలాపాలు మొదలు పెట్టింది. 1975లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మాయాబజార్‌కు ప్రత్యామ్నాయంగా 'ది ఇందిరా కో ఆపరేటివ్ ఆటోనగర్ లిమిటెడ్‌ను ఏర్పాటుచేశారు. మాయాబజార్లోని వ్యాపారులు, మెకానిక్కులు, కార్మికులకు ఆటోనగర్లో ఉపాధిని కల్పించింది. దీంతో మాయాబజార్ ద్విచక్ర వాహనాలకు పరిమితమవగా ఆటోలు, కార్లు, లారీలకు సంబంధించిన కార్ఖానాలన్నీ ఆటోనగర్‌కు తరలి వెళ్లాయి. సువిశాల ప్రాంతం కావడంతో అక్కడ ఆటోనగర్ విస్తరణకు అవకాశాలు మెండుగా లభించాయి. అంతే అద్భుతమైన ఆటోమొబైల్ ప్రపంచం అక్కడ ఆవిష్కృతమయింది.



ఆటోనగర్‌లో వాహనాల మరమ్మతు షాపు ల్లోని దృశ్యాలు

విడిభాగాల కాణాచి..

ఆటో మొదలు.. ఆడి కారు వరకూ, సాధారణ లారీ మొదలు భారీ కంటెయినర్ వరకూ ఏ వాహనానికి సంబంధించిన స్పేర్ పార్టులు కావాలన్నా ఆటోనగర్లో లభిస్తున్నాయి. తొలి రోజుల్లో చిన్న, చిన్న స్థానిక వాహనాలకు సంబంధించిన విడిభాగాలకే పరిమితమైన ఆటోనగర్ అనతికాలంలోనే భారీగా విస్తరించింది. ఇక్కడున్న కార్ఖానాల యజమానులు తమ వ్యాపారాన్ని ఇతర రాష్ట్రాలకు విస్తరించారు. గుజరాత్, ఢిల్లీ, ఒడిషా, తమిళనాడు ప్రాంతాలకు వెళ్లి అక్కడ పాత వాహనాలను కొని వాటిని స్ర్కాప్‌గా మార్చే ప్రక్రియను ప్రారంభించారు. దీంతో అన్ని బ్రాండ్ల వాహనాల స్పేర్ పార్టులు గుంటూరులో అందుబాటులోకి వచ్చాయి. ఆటోనగర్లో ప్రస్తుతం 100కు పైగా కార్లను తుక్కుగా మార్చే కార్ఖానాలు ఉన్నాయి. అక్కడ మారుతి 100 మొదలు తాజాగా అందుబాటులోకి వచ్చిన వాహనాల విడిభాగాలు అన్నీ అందుబాటులో వుంటున్నాయి. స్విఫ్ట్, స్విఫ్ట్ డిజైర్, పార్చ్యూనర్, బొలేరో, ఇన్నోవా, మహీంద్ర, ఎక్స్‌యూవీ, స్కార్పియో, గ్జైలో సహా ఎన్నో రకాల కార్లకు సంబంధించిన సస్పెన్షన్స్, ఇంజన్, డోమ్‌లు, చక్రాలు, టైర్లు. హెడ్‌లైట్లు, సహా అన్నీ ఇక్కడ లభిస్తున్నాయి. ఆటోనగర్ విస్తరణను ఆఖరికి రైల్వే ట్రాక్ కూడా ఆపలేక పోయింది. ఆటోనగర్లో చోటు సరిపోక రైల్వే ట్రాక్ అవతలి ప్రాంతాన్ని కూడా డంపింగ్ కోసం వినియోగించుకుంటున్నారు. ఆటోనగర్లో 50కి పైగా లారీ కార్ఖానాలు వున్నాయి. లారీలకు సంబంధించిన అన్ని బ్రాండ్ల స్పేర్‌పార్టులు ఇక్కడ అందుబాటులో వున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. కాగా ఇక్కడ ప్రతి రోజూ పదుల సంఖ్యలో కాలం తీరిన లారీలు, ప్రమాదాలకు గురైన కార్లను తుక్కు కింద మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. దీంతోపాటు ఆటోలు, కార్లు, లారీలు, ట్యాంకర్లకు కావాల్సిన ఆకృతులను బట్టి వాటికి బాడీ బిల్డింగ్ కూడా చేస్తున్నారు. కరోనా అనంతరకాలంలో ఆయిల్ ధరలు పెరగడంతో లారీల యజమానులు మరమ్మతులు చేయించడం, కొత్త లారీలు కొనడం మానేశారు. దీంతో బాడీ బిల్డింగ్ పనులు తగ్గి వర్కర్లు దెబ్బతింటున్నారు.

ఆటోనగర్.. స్వరూపం..

1975లో గుంటూరు ఆటోనగర్ పురుడుపోసుకుంది. అప్పట్లో గుంటూరునగరానికి శివారున వున్న గుంటూరు- పెదకాకాని రోడ్డులో వున్న కాళీ స్థలాన్ని ఆటోనగర్‌కు కేటాయించారు. గుంటూరు ఆటో నగర్ 283 ఎకరాల్లో విస్తరించి ఉంది. అందులో 2,416 ప్లాట్లు వున్నాయి. వాటిలో 1,923 ప్లాట్లలో కార్యకలాపాలు జరుగుతున్నాయి. తొలుత ఆటోమొబైల్ రంగానికే పరిమితమైన ఆటోనగర్ ఆ తరువాత తన పరిధిని విస్తరించింది. ఎలక్ట్రానిక్స్‌తో పాటు ప్లాస్టిక్ పరిశ్రమల వైపు అడుగులు వేసింది. అంతటితో ఆగకుండా ఇతర రంగాలకు కూడా విస్తరించింది. కార్పెంటరీ రంగంతోపాటు, పరుపుల తయారి రంగానికి కూడా అవకాశం కల్పించింది. వాటితో పాటు ఆటోమొబైల్ షోరూమ్‌లు ఇటీవలి కాలంలో భారీగా ఏర్పాటు చేశారు. ఈ మొత్తం కలుపుకుంటే ప్రతి ఏటా 2వేల కోట్ల రూపాయలకు పైగా టర్నోవర్ జరుగుతున్నట్లు అంచనా! కాగా ఆటోనగర్లో 10వేల మందికి పైగా టెక్నీషియలన్లు, మెకానిక్కులు ఉపాధి పొందుతున్నారు. వారితోపాటు అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటోనగర్ ఉపాధి కల్పిస్తోంది.



లారీ బాడీ బిల్డింగ్ చేస్తాం: షేక్ బాజీ : బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు

అన్ని రకాల లారీలకు బాడీ బిల్డింగ్ చేస్తాం. 2020కి ముందు వున్న లారీలకు బాడీ బిల్డింగ్ చేస్తాం. ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు, వెల్డరు, కార్పెంటర్, టింకర్, పెయింటర్లుగా పనిచేస్తున్నారు. కరోనా తరువాత పనులు కోల్పోయి చాలా మంది బయటకు వెళ్లిపోవాల్సి వచ్చింది. ఆయిల్ రేట్లు పెరగడంతో కొత్త లారీలు కొనే పరిస్థితి లేదు. అందువల్ల ఇటీవల పనులు తగ్గుతున్నాయి.



అన్ని రకాల కార్ల భాగాలు లభిస్తాయి

ఖలీల్ ఖాన్, ఓల్డ్ మోటార్ పార్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

ఆటోనగర్లో అన్ని రకాల కార్లకు సంబంధించిన స్పేర్ పార్టులు దొరుకుతాయి. పాత తరం మారుతి కారు మొదలు ఇటీవల ఎక్కువగా వినియోగించే ఎన్నో రకాల కార్ల స్పేర్ పార్టులు ఇక్కడ లభిస్తున్నాయి. స్విఫ్ట్, స్విఫ్ట్ డిజైర్, పార్చ్యూనర్, బొలేరో, ఇన్నోవా, మహీంద్ర, ఎక్స్‌యూవీ, స్కార్పియో, గ్జైలో వంటివి పేరుకు కొన్ని మాత్రమే. ఇంకా ఎన్నో రకాల కార్ల విడిభాగాలు అందుబాటులో ఉంటాయి.



కార్మికుల కునుకు పాట్లు

ప్రపంచాన్ని అలవోకగా జయించిన అలెగ్జాండర్ సైతం చిన్న దోమ చేతిలో పడి ఘోరంగా దెబ్బ తిన్నాడు.అందుకే పాము కాటుకన్నా దోమ కాటు మిన్న అంటారు.మరి గుంటూరు బస్టాండ్ లో పగలు, రేయి అన్న తేడా లేకుండా దోమలు విజృంభిస్తూనే ఉంటాయి. వాటి భారి నుంచి తప్పించు కునేందుకు రాత్రి వేళ డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ లు ఇలా బస్సులపైనే దోమ తెరలు వేసుకొని నిద్రపోతున్నారు. ఊరంతా హాయిగా నిద్రపోతున్న ఆర్టీసీ కార్మికులకు కునికి పాటు కోసం ఎన్ని అవస్థలో. గురువారం అర్ధరాత్రి గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కనిపించిన దృశ్యాలు.

- (ఆంధ్రజ్యోతి, గుంటూరు)

నిరుపయోగంగా జగనన్న ఇంటిస్థలాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అర్జీల రాసే కార్యక్రమంలో పాల్గొన్న కే రామకృష్ణ, ముప్పాళ్ల తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే సెంటు స్థలం పేదల నివాసానికి ఏ మాత్రం సరిపోదని సీపీఐ ఆనాడే వైసీపీ ప్రభుత్వానికి చెప్పినా ఖాతరు చేయకుండా మొండిగా ముందుకెళ్ళింది. దీంతో పేదల ఇంటి కల నెరవేరలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా స్థలం, ఇంటి నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అర్జీలు రాసే కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వేల కోట్లు ఖర్చు పెట్టి 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినా ఆ స్థలాలపై లబ్ధిదారులు సుముఖత చూపలేదన్నారు. పైగా ఇచ్చే రూ.1,80,000తో పునాదులు కూడా పూర్తిచేయలేమని పేదలెవ్వరూ ముందుకు రాలేదన్నారు. దీంతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు నిరుపయోగంగా మారిపోయాయని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రాంతాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి 4 లక్షలు ఇస్తానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ అర్జీలు రాసే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పెరిగిన ఖర్చులు నేపథ్యంలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు పెంచాలని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లను మార్పు చేసి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలాలు ఇవ్వాలన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రిని కలవనున్నట్లు చెప్పారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 18న సచివాలయాల అధికారులకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో 17న దక్షిణ భారత న్యాయవాదుల సదస్సు

విజయవాడ లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై ఒకటవ తేదీ నుంచి అమలులోకి తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలిపి వేయాలని కోరుతూ నవంబరు 17న చెన్నై నగరం, తెనియంపేట్‌లోని కామరాజర్ హాలులో తమిళనాడు, దక్షిణ భారత న్యాయవాదుల సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, అడ్వకేట్స్ జేఏసీ నేతలు వై.కోటేశ్వరరావు, నల్లూరి మాధవరావులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన 'భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్షా అధినియం' చట్టాలు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే విధంగా వున్నాయని వారు తెలిపారు. న్యాయవ్యవస్థలో పోలీసు యంత్రాంగానికి యథేచ్ఛగా అధికారా లను కల్పిస్తూ, న్యాయవ్యవస్థకు వున్న అధికారా లను కుదిస్తూ, న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ఈ చట్టాల అమలు ప్రజలకు నష్టదాయకం అని దేశవ్యాప్తం గా న్యాయవాదులు ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. ఉద్యమ కార్యాచరణను రూపొందించుటకు, వెంటనే నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

దేశం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థిని విద్యార్థులతో ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్ 2024 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజిలో వైభవంగా కొనసాగుతున్నాయి . పోటోపోటీగా చిన్నారుల ప్రదర్శన ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. తొలి రోజు శుక్రవారం 23 అంశాలలో 9 విభాగాలలో 30 వేదికలపై చిన్నారుల కనువిందైన ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలిరోజు పోటీలలో 330 పాఠశాలలు నుండి 4000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారులు వారిని తోడ్కొని వచ్చిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో వీవీఐటీ బాలోత్సవ్ ప్రాంగణంలో సందడి నెలకొంది.

భళా..బాలోత్సవ్



విద్యార్థిని జానపద కళా ప్రదర్శన

- నేత్రానందంగా వీవీఐటీ కళాశాల ప్రాంగణం
- పోటా పోటీగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు
- అబ్బుర పరుస్తున్న నాటికలు.

పెదకాకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భళా ... బాలోత్సవం అన్నట్లుగా ఉంది వీవీఐటీ ప్రాంగణం. నంబూరు వీవీఐటీ కళాశాలలో తొలిరోజు శుక్రవారం బాలోత్సవ్ వేడుకలు అత్యంత నేత్రానందంగా ప్రారంభమయ్యాయి. చిన్నారుల పోటాపోటీ ప్రదర్శనలు సందర్శకులను అబ్బురపరుస్తున్నా. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, సందర్శకులతో వీవీఐటీ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అతిథిగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అద్భుత ప్రతిభా పాటవాలను విద్యార్థులు బాలోత్సవ్‌లో ప్రదర్శిస్తున్నారని, 60 కళలను ప్రోత్సహించే విధంగా బాలోత్సవ్ నిర్వహించడం మంచి పరిణామం అని అన్నారు. జీవితం అంటే కేవలం డాక్టర్లు, ఇంజనీర్లు మాత్రమే కాదని కష్టపడి మనకి ఉన్న ప్రతిభతో ముందుకు వెళ్లడం ద్వారా చిత్రగారిలా సింగర్, అబ్దుల్ కలాం, నారా చంద్రబాబులా నాయకులుగా ఎదగగలరని అన్నారు. మనలో ఉన్న ప్రతిభ మనకి తెలుస్తుం దని వాటిపై దృష్టి సారించండి అని బాలలకు హితవు పలికారు. తల్లిదండ్రులు విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.

జానపదనృత్యం, ఏకపాత్రాభినయం, సాంప్రదాయ నృత్యం, సాంప్రదాయ వస్త్రధారణ వంటి విభాగాలు తొలిరోజు వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా మిగిలాయి. అత్యధికంగా చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం విభాగంలో 1800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు వక్తృత్వం, తెలుగులోనే మాట్లాడదం, తెలుగు పద్యం, వంటి విభాగాలు విద్యార్థిని విద్యార్థులలో తెలుగుపై వున్న మక్కువను తెలియచేసాయి.

బాలోత్సవ్ ప్రాంగణం నంద గల్లా జయదేవ్ కుమారుడు గల్లా అశోక్ హీరోగా నటించిన దేవకీ నందన వాసుదేవ ఈనెల 22న విడుదల కానున్న నేపథ్యంలో హీరో, హీరోయిన్ మానస చిన్నారులతో సందడి చేసారు. నంది అవార్డ్ దక్కించుకున్న కపిరాజు నాటకాన్ని ప్రదర్శించారు.



విద్యార్థిని నృత్య ప్రదర్శన



చిన్నారికి భోజనం తినిపిస్తున్న తల్లి..







నంబూరు వీవీఐటీ కళాశాలలో జరుగుతున్న బాలోత్సవంలో చిన్నారుల ప్రదర్శనలు



చిన్నారికి భోజనం తినిపిస్తున్న తండ్రి

రైలునుంచి జారిపడి గుర్తుతెలియని మహిళ మృతి

సింగరాయకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. ఈ ఘటన సింగరాయకొండ-ఉలవపాడు మధ్య ఉన్న చిల్లాకాలువ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. మృతురాలి వయసు 40-50 ఏళ్లు ఉండవచ్చని వారు భావిస్తున్నారు.

తూమాడు సర్పంచ్, కార్యదర్శులపై ఫిర్యాదు

జరుగుమల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన మండలంలోని తూమాడు సర్పంచ్ వి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి డి.మౌనికలపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ కనపర్తి శ్రీనివాసరెడ్డి డీపీవోను కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్, కార్యదర్శి ఇద్దరూ కలిసి అవినీతికి పాల్పడ్డారని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పంచాయతీ ఆమోదం లేకుండా నిధులు ఖర్చు చేశారని, వ్యక్తిగతంగా కూడా కొంత డ్రా చేసుకున్నారని ఆయన డీపీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆమేరకు ఆడిట్ అధికారులు గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్యాంక్ ఖాతాలో నగదు మాయంపై కేసు

నాగులుప్పలపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుడికి తెలియకుండా తన బ్యాంక్ ఖాతాలోని నగదు చెల్లింపు జరగడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన పోకూరి శ్రీనివాసరావుకు స్థానికంగా ఉన్న కెనరాబ్యాంక్‌లో ఖాతా ఉంది. తన ఖాతాలో ఉండాల్సిన నగదులో నుంచి రూ.2.40లక్షలు తన ప్రమేయం లేకుండా చెల్లింపులు జరిగినట్లు గుర్తించారు. దాంతో బాధితుడు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

33మంది కానిస్టేబుళ్లు బదిలీ

ఒంగోలు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 33 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివిధ పోలీస్‌స్టేషన్‌లలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న వారికి మోమోలు ఇచ్చి బదిలీ చేశారు.

అభాగ్యురాలిగానే...

పోలీసు కార్యాలయం వద్ద పెట్రోలు పోసుకున్న యువతి మృతి

నేడు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంత్యక్రియలు

ప్రియుడు మత్తయ్యను అరెస్టు చేయాలని డిమాండ్

ఒంగోలు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం ఎదుట ఈనెల 11న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన కర్ణాటకకు చెందిన యశోదచౌహాన్(25) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మధ్యాహ్నం ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, తహసీల్దార్ వాసు అక్కడకు చేరుకుని శవపంచనామా నిర్వహించారు. యశోద ఆమె బంధువులు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించారు. దీంతో ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక కమ్మపాలెం శ్మశానవాటికలో అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. ప్రేమ పేరుతో సహజీవనం చేసి కనిపించకుండా పోయి యువతి ఆత్మహత్యకు కారకుడైన మత్తయ్యను వెంటనే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

అంతర్ జిల్లాల సీనియర్ కబడ్డీ పోటీలు

ఒంగోలు(రూరల్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సూదనగుంట కోటయ్యచౌదరి జడ్పీ హైస్కూలులో డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు అంతర్ జిల్లాల సీనియర్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఎస్పీ దామోదర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఈ పోటీలు సూదనగుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ అంతర్ జిల్లాల స్త్రీ, పురుష కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురు జరుగుతాయని, రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల నుంచి 13 స్త్రీ, 13 పురుష జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి, ప్రీమియం లీగ్‌పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎస్.చంద్రమోహనరెడ్డి, ట్రెజరర్ డి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని జేబు సంస్థగా మార్చిన జగన్

బిల్లుపై చర్చలో ఎమ్మెల్యే ఏలూరి



అసెంబ్లీలో విద్యుత్ బిల్లుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థలను వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి జేబు సంస్థగా మార్చుకొని ఆ నిధులను ఇతర అవసరాలకోసం వాడుకున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో విద్యుత్ బిల్లుపై ఆయన మాట్లాడారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సవరణ బిల్లును ప్రవేశ పెట్టారని ఆయనకు ఎన్డీఏ ప్రభుత్వం పక్షాన అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభానికి గురయ్యిందన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో దాదాపు 20 మిలియన్‌ల లోటు విద్యుత్ ఉందని, కరంటు కోతతో ప్రజలు సతమతం అవుతున్న తరుణంలో చంద్రబాబు సమర్థవంతంగా 2014-19 మధ్య నాణ్యమైన నిరంత విద్యుత్‌ను అందించారని గుర్తు చేశారు. అలాగే కరంటు చార్జీలను భవిష్యత్‌లో పెంచబోమని ఇచ్చిన మాటను నిలబెట్టామన్నారు. రాష్ట్రంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరంగా విద్యుత్ రంగంలో సమూలమైన మార్పునకు తెలుగుదేశం ప్రభుత్వం నాంది పలికిందని వివరించారు. 2019-24 మధ్యకాలంలో జగన్మోహన్ రెడ్డి హయాంలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. అనాలోచిత నిర్ణయాలు, అవినీతి ఆలోచనలతో తక్కువ ధరకు కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను, పీపీఎలు రద్దు చేయడం వల్ల వేల కోట్ల రూపాయలు ఆర్థిక భారం విద్యుత్ వినియోగదారులపై వైసీపీ ప్రభుత్వం మోపిందని ఏలూరి దుయ్యబట్టారు. 8 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. పీపీఏలను రద్దు చేయటం వల్ల విద్యుత్ రంగంలో పెట్టుబడిదారులు భారతదేశం నుంచి పారిపోయే స్థితికి జగన్మోహన్‌రెడ్డి సర్కార్ తీసుకు వచ్చిందని ఆరోపించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని 2037 నాటికి పూర్తిగా గ్రీన్ పవర్‌కి షిఫ్ట్ కావాలని ఆయన ఆకాంక్షించారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న నరసింహారావు

చినగంజాం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు ఎస్.నరసింహారావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా చినగంజాం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తరగతి పుస్తకాలతో పాటు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండే మహనీయుల జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్ అంశాలు, కరెంట్ ఎఫైర్స్ తెలుసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. గ్రంథపాలకుడు ఎం.మోహనలక్ష్మీనరసింహాచార్యులు, రామచంద్రానగర్ ప్రాథమిక పాఠశాల హెచ్.ఎం గుత్తి శారద, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ పోతురాజు, వై.రామాంజనేయులు, షేక్ నాయబ్ రసూల్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సముపార్జన జరుగుతుందని గ్రంథపాలకుడు చుండూరి సుగుణరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండవరోజు శుక్రవారం అద్దంకి లోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాల పై అవగాహన కల్పించారు. పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు.

ప్రత్యేక ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి



శిక్షణలో మాట్లాడుతున్న రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథం

బల్లికురవ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రతినిధులు ప్రత్యేక ప్రణాళికలతో గ్రామాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఏపీఎస్ఆర్‌డీ డిప్యూటీ డెరెక్టర్ జె. రామనాథం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు, మండల స్థాయి అధికారులకు శిక్షణ జరిగింది ఈ శిక్షణను రాష్ట్రఅధికారుల బృందం పరిశీలించింది. ఈసందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు ప్రజలతో కలిసి సభలు ఏర్పాటు చేసుకొని రాబోవు రోజుల్లో గ్రామాలలో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణలో బాపట్ల ఫ్యాకల్టీ మెంబరు వెంకటేశ్వర్లు, ఒంగోలు డీటీఎం అమర్ బాబులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె. కుసుమకుమారి, ఎంపీపీ శ్రీలక్ష్మీ, ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ

పంగులూరు : ప్రజా ప్రణాళిక ఉద్యమంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళికల తయారీ కోసం ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు శనివారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. ఈ శిక్షణకు నిర్దేశించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పలు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- మోటార్ సైకిళ్లను చోరీ చేసే ఐదుగురు ముఠా అదుపులో
- రూ.12 లక్షల విలువైన 17 బైక్‌లు స్వాధీనం
- ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు.. గంజాయి విక్రయాలు చేసే మరో ముగ్గురు కూడా...
- వివరాలను వెల్లడించిన ఎస్పీ దామోదర్



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోరీలకు పాల్పడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద సుమారు రూ. 12లక్షల విలువైన సొత్తును, కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా..

జిల్లాలోని పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగ దొంగిలించి విక్రయించడంతో పాటు గంజాయిని తెచ్చి విక్రయాలు చేస్తున్న ముగ్గురిని త్రిపురాంతకం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 16 కిలోల రాగితీగ, కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తాళ్ళూరు మండలం సోమవరప్పాడుకు చెందిన పోలా జాన్సన్ అలియాస్ జానీ, దర్శికి చెందిన కుంచాల లింగేష్, నెల్లూరు జిల్లా లింగసముద్రంనకు చెందిన గురునాథంలాజర్‌లు కలిసి దర్శి, ముండ్లమూరు, కురిచేడు ప్రాంతాలలో రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు పగులకొట్టి రాగి తీగ దొంగిలించారు. రాగి తీగను విక్రయించగా వచ్చిన నగదుతో సరదాలు చేస్తూ వినుకొండ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసేవారు. కురిచేడు రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడ విక్రయించే ప్రయత్నం చేస్తుండగా త్రిపురాంతకం సీఐ జి.అసన్ తన సిబ్బందితో పట్టుకున్నట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11.30గంటలకు ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నామని, వారిని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీలకు పాల్పడినట్లు వారు తెలిపారని వెల్లడించారు.

17 మోటార్‌సైకిళ్లు స్వాధీనం

దర్శి పరిసర ప్రాంతాల్లో మోటార్‌సైకిళ్లను చోరీ చేసే ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ దామోదర్ తెలిపారు. వారి వద్ద రూ.12లక్షల విలువైన 17 మోటార్‌సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. శుక్రవారం దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ మురళి తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు అనుమానితులు రెండు మోటార్‌సైకిళ్లపై వెళుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో వారి వద్ద ఉన్న రెండు మోటార్ సైకిళ్లతో పాటు వారు చోరీ చేసిన మరో 15 వాహనాలను మెకానిక్ గోపి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. దర్శి మండలం గంగపాలెంనకు చెందిన అంకాల శ్రీను, కప్పల పవన్, కప్పల భవానీశంకర్, బండారు శ్రీహరి, దర్శి మండలం దేవవరంనకు చెందిన గంజ గోపిని శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు చెప్పారు. దర్శి, కనిగిరి, పొదిలి ప్రాంతాలతో పాటుగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కూడా వీరు మోటార్‌సైకిళ్లు చోరీ చేశారని ఎస్పీ వివరించారు.

పోలీసులకు రివార్డులు

మోటార్‌సైకిళ్ల చోరీ కేసులో 17 వాహనాలను రికవరీ చేసిన దర్శి సీఐ వై.రామారావు, ఎస్ఐ మురళి, ఏఎస్ఐ రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ శివశంకర్, కానిస్టేబుల్ మహేష్, గిరిలను ఎస్పీ దామోదర్ అభినందించారు. అదేవిధంగా త్రిపురాంతకం పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను పట్టుకున్నందుకు సీఐ అసన్‌తో పాటు సిబ్బందని అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలి

అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

పర్చూరివారిపాలెంలో లేఅవుట్ పరిశీలన

సమస్యలను చెప్పిన లబ్ధిదారులు



హౌసింగ్ లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పొన్నలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పక్కా ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని పర్చూరివారిపాలెంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో అక్కడే సమావేశం నిర్వహించారు. ఇళ్లు పూర్తి చేయకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిట్ వ్యయానికి తోడు డ్వాక్రా మహిళలకు రుణాలు ఇప్పించి ఇళ్లు పూర్తి చేయించాలని వెలుగు ఏపీఎంను ఆదేశించారు. నిర్మాణ సామగ్రిని తెచ్చే వాహనాలు లేఅవుట్‌లోకి వచ్చే వీలులేకుండా పోయిందని లబ్ధిదారులు తెలిపారు. దీంతో కలెక్టర్ పీఆర్ ఏఈ కోటేశ్వరరావును పిలిచి రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ గడువు వచ్చేనెలతో ముగుస్తున్నందున లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసుకోవాలన్నారు. కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, హౌసింగ్ డీఈఈ సత్యనారాయణ, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో సుజాత, అధికారులు పాల్గొన్నారు.

ఒడా చైర్మన్ టీడీపీకే

తేల్చిచెప్పిన లోకేష్

పరిశీలనలో పాపారావు, లక్ష్మి, ఎరిక్షన్ పేర్లు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ పదవి టీడీపీకే దక్కనుంది. ఆ మేరకు రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తేల్చిచెప్పారు. తదనుగుణంగా జిల్లాలో టీడీపీకి చెందిన దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే రెండు విడతలుగా నామినేటెడ్ పదవులను టీడీపీ కూటమి ప్రభుత్వం భర్తీచేసింది. రెండో విడతగా భర్తీ చేసిన పదవుల్లో అనేక అర్బన్ డెవలప్‌మెంట్ పదవులను విడుదల చేశారు. అయితే ఒడా చైర్మన్ పదవిని భర్తీ చేయకపోవడానికి కారణం లేకపోలేదు. జిల్లాలోని టీడీపీ నేతలు ఇటీవల సమావేశం అయిన పుడు ఆ పదవిని జనసేనకు కేటాయించాలని ఒంగోలు ఎమ్మెల్యే జనార్ధన్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో జనసేనకు కేటాయించిన పదవులపై ఒక అంగీకారానికి వచ్చినందున జిల్లాలో కీలకమైన ఒడా చైర్మన్ పదవిని టీడీపీకే ఉంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ మేరకు జిల్లా నేతలు విషయం ప్రస్తావించగానే లోకేష్ స్పందిస్తూ ఆ పదవిని టీడీపీ వారికే ఇవ్వాలని, మీరు తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూటిగా చెప్పినట్లు సమాచారం. నేడో, రేపో ఆ పదవికి చైర్మన్‌ను ఎంపిక చేసే ఉద్దేశంతో కొన్ని పేర్లు పరిశీలిస్తున్నారు. దర్శి మాజీ ఎమ్మెల్యే పాపారావుతోపాటు గత ఎన్నికల్లో ఓడి ఇన్‌చార్జులుగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్ బాబు పేర్లను పరిశీలిస్తున్నారు. ప్రధానంగా నారపుశెట్టి పాపారావుకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ అధికారంలో ఉండగా దర్శి నగర పంచాయతీ గెలుపులో స్థానికంగా నారపుశెట్టి కుటుంబీకులకు ఉన్న ఆదరణ కలిసి రావడం, తొలి నుంచి పాపారావు పార్టీలోనే కొనసాగుతుండటాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిసింది.

అవీఇవీ

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



కారంచేడులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నేతలు

కారంచేడు(పర్చూరు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో సక్రమంగా రోడ్లు, డ్రైనేజీలు లేక అవస్థలు పడిన ప్రజానీకానికి కూటమి ప్రభుత్వం రాకతో ఊరట కలిగింది. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కార్యక్రమంలో భాగంగా కారంచేడులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీంతో శుక్రవారం కారంచేడు ఆరవ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలిగ శివపార్వతి, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ, ఎంపీటీసీ శేషారత్నం, భూలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలను నిరసిస్తూ సీపీఎం ఆందోళన



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

పంగులూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలతో ప్రజలు తల్లడిల్లుతున్నారని సీపీఎం నేత రాయిణి వినోద్‌బాబు అన్నారు. ఆకాశన్నంటిన ధరలను నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధరలను అదుపు చేసే చర్యలు చేపట్టాలని, రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకు నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన వారికి సరైన వైద్యం అందించాలని, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేయరాదని, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ కోరుతూ డీటీ ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ అధ్యక్షులు తలపనేని రామారావు, సుబ్బారావు, సభ్యులు కృష్ణకుమారి, సుబ్బరాజు, ఏలియా, ఆదుంసాహెబ్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

25 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల ప్రతినిధులు

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఇటీవల టెక్ మహీంద్రా కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. సీఎస్ఈ, ఈసీఈ, ఏఐఎంఎల్, ఐవోటీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతులు డాక్టర్ పి.హరిణి, డాక్టర్ డి. రాజేంద్రప్రసాద్, డాక్టర్ సి. హరికిషన్, డాక్టర్ ఎస్. ఇంద్రనీల్, డాక్టర్ కె. సుబ్బారావు, డాక్టర్ ఎం. రమేష్, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరేంద్ర వర్గం.. నిర్వేదం

- చీఫ్‌విప్ పదవి ఆశించి ధూళిపాళ్ల భంగపాటు
- విప్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే నరేంద్ర విముఖత
- రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు మొక్కుబడిగా హాజరు
- మా నేతకు అన్యాయం జరిగిందని అనుయాయుల అసంతృప్తి

(తరువాయి...)

కూడా లేకపోవడంతో ఆ ప్రాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు ఆలోచన చేయడంతో నరేంద్ర పేరు వెనక్కు వెళ్ళిపోయింది. వినుకొండ నుంచి గెలుపొందిన జీవీ ఆంజనేయులును చీఫ్‌విప్ పదవి వరించింది. ఈ క్రమంలో నరేంద్రకు విప్ పదవి ఇస్తామని ప్రతిపాదించగా ఆయన సుముఖత వ్యక్తం చేయనట్లు తెలిసింది. కేబినెట్ హోదా స్థాయి పదవిని ఆశిస్తున్నట్లు నరేంద్ర అధిష్ఠానానికి తెలియజేసినట్లు సమాచారం. కాగా నరేంద్రకు చీఫ్‌విప్ పదవి రాలేదని తెలిసినప్పటి నుంచి పార్టీ శ్రేణులు అసంతృప్తి గళం వినిపిస్తున్నాయి. నరేంద్ర కూడా కొంత మనస్థాపానికి గురై రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు మొక్కుబడిగా హాజరవుతున్నారు.

ప్రతిసారీ నిరాశే

రాష్ట్ర ప్రభుత్వ పదవుల పందేరంలో పొన్నూరు నియోజకవర్గానికి సరైన ప్రాధాన్యం లభించడంలేదని టీడీపీ శ్రేణులు అసంతృప్తి, ఆవేదనకు గురవుతున్నాయి. నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా నిలిపిన ఘనత ధూళిపాళ్ల కుటుంబానిది. ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పొన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికై 1989 వరకు రెవెన్యూ శాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో రోడ్డు ప్రమాదంలో వీరయ్యచౌదరి మృతి చెందగా ఆయన వారసుడిగా నరేంద్ర రాజకీయ ఆరంగేట్రం చేశారు. ఆయన వరసుగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైయ్యారు. 2019 ఎన్నికలో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా తిరిగి 2024లో అఖండ విజయాన్ని సాధించారు. అయితే ప్రతిసారి నరేంద్ర పేరు మంత్రి పదవి రేసులో ఉండటం భంగపడటం నరేంద్రతో పాటు ఆయన అనుయాయులకు పరిపాటిగా మారింది. వీరయ్యచౌదరి తర్వాత 35 ఏళ్లుగా నియోజకవర్గానికి అమాత్య యోగం దక్కలేదు. అంతే కాకుండా నామినేటెడ్ పదవుల్లో సైతం పొన్నూరుకు సరైన ప్రాధాన్యం లేదని కార్యకర్తలు తీవ్ర నిరాశతో ఉన్నారు.

బీపీసీఎల్ పెట్రోల్ పైపులతో రైతులకు నష్టం

- ఎమ్మెల్యే బీఎన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట చెరువులో ఏర్పాటు చేస్తున్న బీపీసీఎల్ పెట్రోల్ పైపులతో రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణను కలిసిన ఎమ్మెల్యే బీఎన్ వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. పేర్నమిట్ట చెరువుపై ఆధారపడి 194 ఎకరాల సాగు ఉందన్నారు. రాబోయే రోజుల్లో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పెట్రోల్ పైపులు పేర్నమిట్ట చెరువు మీదుగా ఇతర ప్రాంతాలకు వేస్తున్నారని, దీనివలల్ల రానున్న రోజుల్లో రైతులతో పాటుగా ప్రజలకు తీవ్రసమస్యగా పరిణమించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులో నుంచి కాకుండా ఇతర ప్రాంతాల మీదుగా పైపులైన్ వేయాలని తెలిపారు. పేర్నమిట్ట చెరువు పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ


వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర వైద్య బృందం

పీహెచ్‌సీలను పరిశీలించిన వైద్య బృందం

ఇంకొల్లు,నవంబరు 15,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంకొల్లు,దుద్దుకూరు ఆరోగ్య కేంద్రాలను డాక్టర్ రాజ్‌కిరణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్‌సీడీ బృందం సందర్శించింది. ఇంకొల్లు గ్రామంలో జరుగుతున్న సర్వే తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిలో అందరిని పరీక్షించి క్యాన్సర్ అనుమానిత కేసులను గుర్తించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ నిర్ధారణ సర్వే నిర్వహిస్తుందని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ అంజలి, సీహెచ్‌వో కోటేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


నష్టం గురించి రైతును అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ అధికారులు

పంట నష్టంపై పరిశీలన

చీరాలటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పంట నష్టాలపై అంచనా వేసేందుకు మండల వ్యవసాయ అధికారిణి సుమతి సిబ్బందితో కలిసి శుక్రవారం మండల పరిధిలోని బుర్లవారిపాలెం, పిట్టువారి పాలెం, గవినివారి పాలెం ప్రాంతాల్లో పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మండల పరిధిలో సుమారు 1000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా సుమారు 50 ఎకరాలకు నష్టం వాటిల్లిందని వివరించారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు రమేష్, శ్రావ్య, ప్రసన్న, రైతులు తదితరులు ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

● ఆర్అండ్‌బీ మంత్రిని కోరిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి సీఆర్ఎఫ్ నిధులను మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు కోరారు. దీనికి సంబంధించిన లేఖను శుక్రవారం మంత్రి చాంబర్‌లో కలిసి అందజేశారు. ఈసందర్భంగా పర్చూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, రహదారుల అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఏలూరి తెలిపారు.


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఏలూరి


సీఐ కృష్ణయ్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ, జనసేన నేతలు

పోసానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్, టీవీ5 న్యూస్ చానల్ అధినేత బీఆర్ నాయుడుపై అసభ్యకర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమురళీపై చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన నేతలు శుక్రవారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ, జనసేన నేతలు నాగినేని రామకృష్ణ, కాకాని అశోక్, మన్నం త్రిమూర్తులు,పెంట్యాల రామాంజనేయులు, దామా హనుమంతరావు, వలి, రాజశేఖర్, సాయి తదితరులు శుక్రవారం సీఐ కృష్ణయ్యను కలిసి ఫిర్యాదు చేశారు.


ట్రస్టీదారుకు వెండికిరీటం,శఠగోపురం ను అందజేస్తున్న దాత ఉమాదేవి

అమ్మవారికి వెండికిరీటం బహూకరణ

యద్దనపూడి,(మార్టూరు)నవంబరు15(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలోని శ్రీఅంకమ్మతల్లి, పోలేరమ్మ తల్లి దేవస్థానంలో శుక్రవారం అంకమ్మతల్లికి వెండికిరీటం, శఠగోపురాన్ని దాత తూమాటి ఉమాదేవి బహూకరించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అమ్మ వారికి లక్షా 15 వేల రూపాయలు విలువకలిగిన కిలో 100 గ్రాములు బరువు గలిగిన వెండితో నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన ఉమాదేవి, భర్త రామకోటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి సంతానం అమరసుధా, మేదరమెట్ల హరిత, గోగినేని ఉదయకృష్ణల సహకారంతో వస్తువులను తయారుచేయించారు. వాటిని దేవస్థానంలో ట్రస్టీదారు దూళ్లిపాళ్ల కుమారస్వామికి అందజేశారు. ఆయన వాటిని అమ్మవారికి నూతన వస్త్రాలతో పాటు అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పుణ్యస్నానాలు

గతంతో పోలిస్తే తగ్గిన భక్తుల సంఖ్య

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం వాడరేవు, వేటపాలెం మండలం రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామాల సముద్ర తీరాలకు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు.


వాడరేవులో సముద్ర స్నానాలు ఆచరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, బాలకొండమ్మ దంపతులు

వేకువజాము బ్రహ్మముహూర్తం సమయంలో భక్తుల రాక మొదలయ్యింది. సుమారు 30వేల మంది సముద్ర స్నానాలు ఆచరించి ఉంటారని అనధికారిక అంచనా.

పుణ్యస్నానాలు ఆచరించిన ఎమ్మెల్యే కొండయ్య దంపతులు

సూర్యోదయానికి మునుపే ఎమ్మెల్యే కొండయ్య, బాలకొండమ్మ దంపతులు వాడరేవు సముద్ర తీరానికి చేరుకున్నారు. సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ మహ్మద్ మొయిన్ ఇతర అధికారులుతో సముద్ర స్నానాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

వర్షాలతో తగ్గిన భక్తుల సంఖ్య

గతంతో పోలిస్తే ఈ ఏడాది సముద్ర స్నానాలకు వచ్చిన భక్తుల సంఖ్య తగ్గింది. నియోజకవర్గ పరిధిలోని అన్ని తీరప్రాంతాలలో కలిపి సుమారు 25వేల మంది భక్తులు వచ్చినట్లు అనధికారిక అంచనా.

- దీపం సమర్పయామి

సముద్ర స్నానాలకు వచ్చిన మహిళా భక్తులు దాదాపు అందరూ తీరంలో దీపారాధన చేశారు. కొందరు బృందాలుగా తమ దీపాలు వెలిగించారు.

- అయ్యప్ప, శివ, భవానీ మాలధారులు

సూర్యోదయానికి మునుపే అయ్యప్ప, శివ, భవానీ, గోవింద దీక్షధారులు సముద్ర స్నానాలు ఆచరించారు. తీరంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సముద్రస్నానాలు అనంతరం మహిళలు వాడరేవులోని కోదండరామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కార్తీక పౌర్ణమి నేపథ్యంలో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. పట్టణ పరిధిలో చీరాల, పేరాల, వేటపాలెం మండలాల పరిధిలోని శివాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వేకువజాము నుంచి తరలివచ్చారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు.

బ్రహ్మగుండంలో కార్తీక స్నానాలు

బల్లికురవ : మండలంలో ప్రసిద్ధిచెందిన కొణిదెన బ్రహ్మగుండం కొలనుకు మండల పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున వచ్చి కార్తీక స్నానాలను చేశారు. అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటుపల్లి, అంబడిపూడి, కొమ్మినేని


ఇంకొల్లు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వారిపాలెం, వేమవరం, కొప్పెరపాడు, ముక్తేశ్వరం, చెన్నుపల్లి, కొండాయపాలెం, కూకట్లపల్లి, నక్కబొక్కలపాడు తదితర గ్రామాలలో ఉన్న శివాలయాలకు భక్తులు వెళ్లి పూజలలో పాల్గొన్నారు. బ్రహ్మగుండం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐ జీవీ చౌదరి సిబ్బందిని అప్రమత్తం చేసి బందోబస్తు ఏర్పాటు చేశారు. కొణిదెన గ్రామస్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చినగంజాంలో..


బల్లికురవ మండలం కొణిదెన బ్రహ్మగుండం కొలనులో కార్తీక స్నానాలు చేస్తున్న భక్తులు

చినగంజాం : మండల పరిధిలోని మోటుపల్లి, బాపయ్యనగర్, పల్లెపాలెం సముద్ర రేవులలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివచ్చిన అశేష భక్తజనంతో కడలి తీరం కోలాహలంగా మారింది. వేకువజామునుంచే భక్తులు సముద్రస్నానాలు చేసేందుకు తరలివచ్చారు. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి సముద్రతీరంలో పసుపుతో గౌరమ్మను చేసి పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శైవక్షేత్రాల వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంకొల్లులో..

ఇంకొల్లు : మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయాన్నే అధిక సంఖ్యలో భక్తులు శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పరమశివుని దర్శించుకున్నారు.ఇంకొల్లు శివాలయంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.


చినగంజాం మండలం బాపయ్యనగర్ సముద్ర తీరంలో భక్తుల కోలాహలం

పర్చూరులో దీపోత్సవం

పర్చూరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామాల్లో శివాలయాలు, అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువజామునే మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించారు. పర్చూరులోని భీమేశ్వరస్వామి ఆలయం, ఉప్పుటూరులోని అమరేశ్వరస్వామివారి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత వేడుకగా జరిగాయి. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

శ్రీ సాయిబాబా అలయంలో

పర్చూరులోని శ్రీ షిర్డి సాయిబాబా అలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన దీపోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.


పర్చూరు శ్రీ షిర్డి సాయిబాబా అలయంలో కార్తీక దీపోత్సవంలో మహిళా భక్తులు

శివనామస్మరణతో కిటకిటలాడిన శివాలయాలు

మణికేశ్వరంలో మంత్రి సతీమణి ప్రత్యేక పూజలు

అద్దంకి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వేకువ జాము నుంచే భక్తులు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ సతీమణి ఝాన్సీ మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానాన్ని ఆమె ప్రారంభించారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అద్దంకి పట్టణంలోని పాత శివాలయం, వేయి స్తంభాల గుడి, కమఠేశ్వరాలయాలలో మహిళాభక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామస్మరణతో శివాలయాలు మారుమోగాయి.


మణికేశ్వరంలో భక్తుల కోలాహలం (ఇన్‌సెట్లో) పూజలు చేస్తున్న మంత్రి సతీమణి ఝాన్సీ


రామకూరు కొండపై శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఎదుట ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పోటెత్తిన భక్తులు

పంగులూరు : మండలంలోని పలు గ్రామాలలో శివక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంగులూరు, మల్లవరం, రేణంగివరం, ముప్పవరం, చందలూరు పరిసర గ్రామాలలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలా తోరణం చేపట్టి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా సామూహిక సాగరహారతి

● ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మహేంద్రనాధ్

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు సముద్రతీరంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం ఎదురుగా సముద్ర తీరంలో కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సామూహిక సాగరహారతి కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్ర నాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సామూహిక సాగరహారతి కార్యక్రమం వాడరేవులో తొలిసారిగా జరగటంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా పండితులు కారంచేటి నగేష్‌కుమార్, వెంకటేష్‌లు తీరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుని స్ఫటిక లింగాన్ని పంచామృతాలతో అభిషేకించారు. మంత్ర పుష్పం జపించారు. అనంతరం సామూహిక సాగరహారతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కనుల పండువగా జ్వాలా తోరణం

అద్దంకి : కార్తీక పౌర్ణమిని పురష్కరించుకొని అద్దంకి పట్టణంలోని పాతశివాలయంలో శుక్రవారం రాత్రి జ్వాలాతోరణం కనుల పండువగా నిర్వహించారు. దేవాలయంవద్ద జ్వాలాతోరణం ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాలతో భక్తులు జ్వాలాతోరణం నుంచి తిరిగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్వాలాతోరణాన్ని తిలకించారు.


అద్దంకి పట్టణంలోని పాతశివాలయం వద్ద జ్వాలాతోరణం

మార్టూరులో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం

మార్టూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో పెద్ద అండర్‌పాస్ వద్ద పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణానికి శుక్రవారం టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు.జాతీయ రహదారి విస్తరణ చేసినప్పటి నుంచి సెంటర్లో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. కానీ వాటి నిర్మాణంపై గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. తద్వారా సెంటర్లో వివిధ పనులు నిమిత్తం,వివిధ గ్రామాలు నుంచి వచ్చిన ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ 10 లక్షల రూపాయలు నిధులు కేటాయించింది. దీంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో షేక్ రజాక్, కామినేని జనార్దన్, కాకోలు వెంకటేశ్వర్లు, జంపని సాంబశివరావు, తొండెపు ఆదినారాయణ, మువ్వా అంజనేయులు, ముక్తిపాటి సాయిబాబా,గొట్టిపాటి వెంకట్రావు, పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మార్టూరులో పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్మాణానికి భూమిపూజలో టీడీపీ నాయకులు


సత్యన్నారాయణ వ్రతం చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి ఏడో వార్షికోత్సవం

పేరాల(చీరాలటౌన్),నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని పేరాల ముత్యాలమ్మ పేటలోని మహాలక్ష్మి అమ్మవారి చెట్టువద్ద భక్తులు ఏడవ వార్షికోత్సవం నిర్వహించారు. ఈక్రమంలో ఉదయం స్కంధ పురాణంలో సూచించిన విధంగా వీరవెంకట సత్యన్నారాయణ స్వామి వ్రతాన్ని 100 మంది పుణ్య దంపతులతో నిర్వహించారు. మహిళలు కలశాలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.

ఏటా కార్తీకమాస పూజల్లో పాల్గొంటాం

మేము స్థానికులమే అయినా ఉద్యోగ రీత్యా హైదరాబాదులో ఉంటున్నాం. కానీ మహాలక్ష్మి అమ్మ అంటే నమ్మకం, కోరిన కోర్కెలు తీర్చే అమ్మ పూజల కోసం ఏటాఎన్ని పనులు ఉన్నా కార్తీకమాసం పూజలకోసం ఇక్కడికి వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొంటాం.

- చంద్రశేఖర్, లావణ్య దంపతులు

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

చీరాల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులపై మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో శుక్రవారం పురపరిధిలో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా చెత్త తొలగించటంతో పాటు నిర్ణీత ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించే విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చెత్త తొలగించటంతో పాటు బ్లీచింగ్ చల్లారు. కాలువల్లో తీసిన పూడికను యుద్ధప్రాతిపదికన తరలించేవిధంగా చర్యలు చేపట్టారు. శివారు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకమని, అందుకు అనుగుణంగా అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.


వీధులు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

మార్టూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై రోడ్డు దాటుతున్న దార్ల పెద్ద వెంకటేశ్వర్లు (73) అనే వృద్ధుడ్ని గుంటూరు వైపు వెళుతున్న టమోటా లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఫ్లైఓవర్ పైజరిగింది. మృతుడిది కిషోర్ నగర్‌గా గుర్తించారు. మృతుడి కుమారుడు చిన్న వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు.

నేటి నుంచి ఆర్టీసీ సమయపాలన మాసోత్సవాలు

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమయపాలన మాసోత్సవం శనివారం నుంచి ప్రారంభమై డిసెంబరు 15 వరకు జరుగుతాయని డీఎం రామ్మోహనరావు తెలిపారు. సమయపాలన మాసోత్సవ కార్యక్రమాలను శనివారం ఉదయం 10.30 గంటలకు నెల్లూరు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ షమీమ్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్మికులు, ప్రయాణికులు హాజరు కావాలని కోరారు.

దుంపల ట్రక్కు బోల్తా

కొత్తపేట(చీరాల), నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : కొత్తపేట సమీపంలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం ఓ దుంపల ట్రాక్టరు ట్రాలీ తిరగబడింది. ఆ సమయంలో పక్కన వాహనాలు, పాదచారులు లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ముందు ట్రాక్టరు ఇంజన్‌ను తొలగించారు. తరువాత దుంపలు తీసి ట్రాలీని లేపారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ శుక్రవారం వైభవంగా జరిగింది. నిత్య పూజల అనంతరం వేదపండితులు, పూజారుల ఆధ్వర్యంలో లక్ష తమలపాకులతో పూజ నిర్వహించి అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

ఘనంగా కృష్ణ వర్ధంతి

చీరాలటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సినీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణ,మహేష్‌బాబు సేవాసమితి ఆధ్వర్యంలో అధ్యక్షులు షేక్ అబ్దుల్ సలామ్ కార్యక్రమం నిర్వహించగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంబేడ్కర్ భవన్, స్థానిక మహిళా మండలీల్లో అన్నదానాలు నిర్వహించారు. అభిమానులు యొహాన్, శ్రీధర్, చుక్కా కృష్ణ, రఫీ, సూరిబాబు, ఎలీషా, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్ పాల్గొన్నారు.


కృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అభిమానులు

చీరాల్లో ఆహార భద్రత అధికారుల తనిఖీలు

చీరాలటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధి హరిప్రసాద్ నగర్‌లోని పలు దుకాణాల్లో ఆహార భద్రత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. తయారీకి వాడుతున్న ముడి సరుకుకు పరీక్షలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంపట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో గరికపాటి ప్రభాకర్, అనిల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.